Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 19.07.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 07 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



### ఆంధ్రాకు

## హరిచందన్

### కొత్త గవర్నర్ నియామకం

దాదాపు 5ఏళ్ళ తర్వాత ఆంధ్ర ప్రదేశ్‌కు కొత్త గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఒడిసాకు చెందిన విశ్వభూషణ్ హరిచందన్‌ను ఆంధ్రా గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి భవనం ఉత్తర్వులు జారీ చేసింది. హరిచందన్ ఒడిసా అసెంబ్లీకి ఐదుసార్లు ఎన్నికయ్యారు. ఆ రాష్ట్ర న్యాయశాఖ మంత్రిగా పని చేశారు. బీజేపీ ఒడిసా రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పని చేశారు. భారతీయ జనసంఘ్ నుండి ఆయన రాజకీయాలలో వున్నారు. కవిగా, రచయితగా ప్రత్యేక గుర్తింపు (మిగతా 11వ పేజీలో)

## కమలంతో... కయ్యమేనా?



### వైసిపికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్న కమలనాధులు

### రాష్ట్రంలో పట్టు కోసం ఎత్తుగడ

### ప్రత్యేకహోదా ఇవ్వకపోతే పోరాటానికి దిగడానికి జగన్ సిద్ధం

**రాజకీయాలలో ఎప్పుడు ఎవరు శత్రువులవుతారో, ఎవరు మిత్రులవుతారో చెప్పలేము. ఇక్కడ శాశ్వత స్నేహాలు, శాశ్వత శత్రుత్వాలు వుండవు. ఈ కోణంలో చూస్తే భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి యుద్ధం చేయక తప్పదేమోననే సంకేతాలు వెలువడుతున్నాయి. ఏపిలో బీజేపీ రాజకీయ ప్రయోజనాలను చూసుకుంటోంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను చూస్తాడు. వీళ్ళు ఎవరి ప్రాధాన్యాల కోసం వాళ్ళు ప్రయత్నించే క్రమంలో ఘర్షణ తప్పదేమోననిపిస్తోంది.**

ఎన్నికలకు ముందుగాని, ఎన్నికల తర్వాతగాని వైసిపితో బీజేపీ ఎంతో స్నేహంగా వుండింది. ఎన్డీఏ కూటమిలో వైసిపి లేనప్పటికీ బీజేపీ అధిష్టానం ఆ పార్టీకి ఎంతో గౌరవమిచ్చింది. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా చంద్రబాబును చిత్తుగా ఓడించిన వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ప్రధాని నరేంద్ర మోడీ అభినందించిన విధానం, అక్కున చేర్చుకున్న పద్ధతి, వారి మధ్య స్నేహానికి నిదర్శనంగా చెప్పొచ్చు. అయితే ఈ స్నేహం ఇక ఎక్కువ కాలం నిలవకపోవచ్చని తెలుస్తోంది.

కేంద్రంతో జగన్ ఇక ఘర్షణకు ఎందుకు దిగాల్సివస్తుందంటే... విభజన చట్టంలో వున్న ఏపికి ప్రత్యేకహోదా హామీని అమలు చేయాల్సిందేనని జగన్ పట్టుబడుతున్నాడు. ప్రతిపక్షనేతగా ఐదేళ్ళు దీనిపై పోరాడాడు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాడు. సీఎంగా రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసం ఆయన గట్టి ప్రయత్నాలు చేయక తప్పదు. (మిగతా 11వ పేజీలో)




### జులై 22న

## చంద్రయాన్-2

### 48 గంటల్లోనే లోపాన్ని సరిచేశారు

ఈనెల 15వతేదీన చివరి గంటలో సాంకేతిక లోపంతో ఆగిపోయిన చంద్రయాన్-2 ప్రయోగానికి ఇస్రో ముహూర్తం పెట్టింది. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 2-43 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి జిఎస్ఎల్‌వి-మార్క్3 వాహక నౌక ద్వారా చంద్రయాన్-2 ప్రయోగం నిర్వహించడానికి సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ నెల 15వ తేదీ తెల్లారుజామున ప్రయోగానికి 56 నిముషాల ముందు రాకెట్ మూడోదశలోని క్రయోజనిక్ ఇంజన్‌లో ఇంధనం (మిగతా 11వ పేజీలో)

## బాబు వస్తానంటే.. బీజేపీ వద్దంటోంది!



### తిరిగి ఎన్డీఏ గూటికి చేరాలనుకుంటున్న చంద్రబాబు ప్రయత్నాలను తిప్పికొట్టిన అమిత్‌షా

ఎన్నికలకు ముందు... ప్రధాని నరేంద్ర మోడీ అంతు తేలుస్తానన్నాడు... ఆయన పుట్టుపుర్వోత్తరాలను ఎంచాడు... మోడీని గద్దె దించే దాకా నిద్ర పోయేది లేదన్నాడు... జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పుతానన్నాడు... ప్రధాని అభ్యర్థిని నిర్ణయించేది నేనేనన్నాడు. ఎన్నికల ఫలితాల తర్వాత సీన్ కట్ చేస్తే.... ఇన్ని ప్రగల్భాలు పలికిన చంద్రబాబునాయుడు అనే పెద్ద నాయకుడికి వచ్చిన లోక్‌సభ సీట్లు మూడు. ఈయన అంతు తేలుస్తానని చెప్పిన నరేంద్ర మోడీకి వచ్చిన సీట్లు మూడొందల మూడు. ఆకాశానికి ఆవగింజకు వున్నంత తేడా! (మిగతా 11వ పేజీలో)



### దాహంతో వచ్చి..

# ప్రాణాలే కోల్పోయి..

## • కుక్కల దాడులతో మరణిస్తున్న వన్యమృగాలు



ఎండలు మండిపోతున్నాయి. ఎక్కడా చుక్కనీరు దొరకడం లేదు. దీంతో జిల్లాలోని అటవీప్రాంతాల్లో ఉన్న వన్యమృగాలు, ముఖ్యంగా జింకలు, దుప్పులు వగైరాలు దాహార్తితో గొంతెండిపోయి నీటికోసం వెతుక్కుంటూ దాహం తీర్చుకునేందుకు పరిసరాల్లో ఉన్న గ్రామ ప్రాంతాలకు వస్తుంటే వాటికి కుక్కల రూపంలో మృత్యువు ఎదురవుతోంది. అసలే దప్పికతో డస్సిపోయి..పరుగెత్తలేని అసహాయ స్థితిలో వస్తున్న ఈ వన్యమృగాలు చివరికి గ్రామాల్లో కుక్కల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇటీవల వాకాడు మండలంలోని కాశీపురం గ్రామంలో ఇలాగే ఒక జింక నీటికోసం వచ్చి గ్రామంలోని కుక్కల బారిన పడి గాయాలపాలై మృతిచెందింది. కుక్కలు ఆ జింకను వెంటాడి తీవ్రంగా కరచి గాయపరిచాయి. ఇది గమనించిన గ్రామస్తులు కర్రలు తీసుకుని కుక్కలను తరిమి వాటి బారి నుంచి జింకను రక్షించినా, వెంటనే సంబంధిత అధికారులు వచ్చి జింకను ఆసుపత్రికి తరలించినా లాభం లేకపోయింది. చికిత్స పొందిన కొద్దిసేపటికే ఆ జింక ప్రాణాలు కోల్పోయింది. ఈనెల 12న ఈ సంఘటన జరిగింది. అదేవిధంగా, ఈనెల 13న అటవీప్రాంతం నుంచి దాహార్తితో చిల్లకూరు మండలంలోని రైటర్‌సత్రం వద్దకు దప్పికతో వచ్చిన ఒక చుక్కల దుప్పిని కుక్కలు దాడిచేసి చంపేశాయి. స్థానికుల సమాచారంతో అటవీ అధికారులు వచ్చి దుప్పి కళేబరాన్ని పంచనామా చేయించి ఆ తర్వాత ఖననం చేశారు. ఎండాకాలం వస్తే చాలు వన్యమృగాలకు ఇలాంటి దిక్కులేని చావు తప్పడం లేదు. ఎంతోకాలంగా ఈ పరిస్థితి మారలేదు. జిల్లాలో వానలే సరిగా కురవక పోతుండడంతో గత కొద్ది కాలంగా అడవుల్లో జంతువుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఎన్ని జంతువులు, ఎన్ని పక్షులు ఎండకు మాడిపోయి ప్రాణాలు కోల్పోతున్నాయో తెలియదు. జిల్లాలోని అటవీప్రాంతాల్లో గుంటలు, కాల్వలు అన్నీ ఎండిపోవడంతో ఎక్కడా నీటివనరులు లేక చుక్క నీరు కూడా దొరక్క జంతువులు అల్లాడిపోతున్నాయి. అటవీ అధికారులు వెంటనే ఈ సమస్యపై దృష్టిపెట్టి, అటవీప్రాంతాల్లో జంతువుల సంచారం ఎక్కువగా ఉన్న చోట్లలో నీటితొట్టెలు ఏర్పాటుచేసి ఆ మూగజీవాల దప్పిక తీర్చి పుణ్యం కట్టుకుంటారని ఆశిద్దాం!...

# నాయీబ్రాహ్మణ సర్వసభ్య సమావేశం



ఈనెల 14వతేదీ నెల్లూరులోని మద్దులూరి వీరరాఘవయ్య నాయీబ్రాహ్మణ కళ్యాణ మండపంలో వేలూరు రంగారావు అధ్యక్షతన నెల్లూరుజిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయిస్ సొసైటి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా బెంగుళూరు శ్రీచైతన్య గ్రూప్స్ అధినేత ఎన్.విజయకృష్ణ, ఏ.పి రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు పి.వి.రమణయ్య, ఏపి రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.కనకారావు, జి.ఉమామహేశ్వరరావు, జిల్లా నుండి పి.సుధాకర్‌రావు, జి.సత్యనారాయణ, వి.దుర్గాప్రసాద్, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్గదర్శి పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశిష్ఠ అతిథులుగా మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, మాజీ కార్పొరేటర్ రాజశేఖర్ పాల్గొన్నారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో 9జిపిఏ సాధించిన 80మంది విద్యార్థులకు రూ.2వేల వంతున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విజయకృష్ణ మాట్లాడుతూ ప్రతియేడాది ఇలాంటి కార్యక్రమానికి రూ.1,01,116/-లు అందజేస్తానన్నారు.



# మురికి కూపంగా.. నెల్లూరు

## • కలుషితమౌతున్న పర్యావరణం.. పట్టించుకోని అధికారగణం

**ఒకవైపు చెత్తాచెదారాలు, మరోవైపు తీవ్రమైన కాలుష్యం, ఇంకోవైపు మండిపోతున్న సిమెంట్‌రోడ్లు అన్నీ కలసి వెరసి నెల్లూరు నగరం నరకంగా మారిపోతోంది. ఎటుచూసినా మురుగుదిబ్బలు, భారీఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి నగరం..కాలుష్య కాసారంగా మారిపోయింది. అయినా అధికారగణం పట్టించుకోవడం లేదు.**

నెల్లూరు నగరం ఇప్పుడు కాంక్రీట్ మయం అయిపోయింది. ఈ సిమెంట్ రోడ్ల వల్ల మరింత వేడి ప్రజల్ని అదరగొట్టేస్తోంది. ఎప్పుడైనా నాలుగు చుక్కల వాన కురిసినా ఈ రోడ్లమీద పడి ఆవిరైపోతోందే తప్ప ఎక్కడా నీళ్ళు నిలిచే పరిస్థితి లేకపోవడంతో నేల చల్లబడడం లేదు. ఎప్పుడూ ఇలాంటి దుస్థితి లేదు. రోడ్ల విస్తరణ కోసమని గతంలో నగరంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న పెద్దపెద్ద చెట్లన్నిటినీ కూలగొట్టేశారు. దీంతో నేటికీ పాదచారులు సేదతీరేందుకు కాస్తంత చల్లని నీడ కూడా లేకుండా పోయింది. అసలే ఎండలు ఇంకా మండిపోతూనే ఉన్నాయి. పగలు పొద్దస్తమానం తీవ్రమైన ఎండతో.. సెగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. నగరంలో ఎండనపడి వచ్చినోళ్ళు.. కాసేపు కూర్చుందామన్నా రోడ్లపక్కన కనీసం షెల్టర్లు కూడా లేవు.

### చెత్తాచెదారాలతో..

### భ్రష్టుపడుతున్న నగరం ...

నెల్లూరుకు ఇంత దరిద్రం వచ్చి పడడానికి మూలకారణం కాలుష్యమేనని వేరే చెప్పనక్కరలేదు. ఎక్కడ చూసినా చెత్తాచెదారాలు, సైడుకాలువల్లో కదలని మురుగునీరు.. వాటినిండా రకరకాల వ్యర్థాలతో నగరమంతా గబ్బుకొట్టిపోతోంది. మనం వేసుకున్న చెత్తే మనల్ని నానా రకాల వ్యాధులకి బాధలకి గురిచేస్తోందేమో అనిపిస్తోంది. రోజుల తరబడి పేరుకుపోతున్న చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకునే పరిస్థితి లేక నగరమంతా మురికికూపంగా మారుతోంది. ఉండే చెత్త చాలదన్నట్లు.. నగరంలోని అనేక ఖాళీస్థలాలు మురుగుమడుగులుగా, కుక్కలు పందులు..దోమలకు నిలయాలుగా మారిపోతూనే ఉన్నాయి. వాటివల్ల వ్యాధులు విపరీతమవుతున్నా, తమ ఖాళీస్థలాలను శుభ్రపరచుకునేవారు కనిపించడం లేదు. అనేక అపార్ట్‌మెంట్ల వద్ద ఈ పరిస్థితి మరింత దుర్భరంగా కనిపిస్తోంది. ఎవరెన్నిసార్లు చెప్తున్నా కాకి అరుస్తూనే ఉంటుంది.. కరవాడ ఎండుతూనే ఉంటుంది అన్న సామెతగా తయారైంది పరిస్థితి.

### పర్యావరణం పట్ల శ్రద్ధ ఏదీ?..

పర్యావరణ పరిరక్షణ పట్ల సమాజంలో నానాటికీ శ్రద్ధ కరువవుతోంది. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటివి నిరంతరం జరుగుతూనే ఉండాలి. వనసంరక్షణ మనసంరక్షణ అనేది కేవలం నినాదంగా మిగలకుండా అటవీ అధికారులు, వన సంరక్షణాధికారులు మరింత శ్రద్ధ తీసుకోవాలి. జిల్లాలో కాలుష్యాన్ని దూరం చేసి మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని మొక్కవోని దీక్షతో కృషిచేస్తున్న వారెవరైనా ఉన్నారా అంటే చిన్నపిల్లలే అని చెప్పాలి. పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు..వారిని ప్రోత్సహించే అయ్యవార్లు, పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత గుర్తెరిగిన కొంతమంది అధికారులు.. స్వచ్ఛంధసేవకులు ఇలా ఏ కొద్దిమంది మాత్రమే పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్నట్లు కనిపిస్తోంది. పర్యావరణం కాపాడుకోకుంటే మానవ మనుగడకే ముప్పు అని తెలిసినా ఇంకా అనేక మంది తమ ధోరణిలో తాము ఉంటున్నారే తప్ప కాలుష్యంతో ముంచు కొస్తున్న ముప్పును మాత్రం గమనించడం లేదు. ఇప్పటికైనా ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయాన్ని వెచ్చించి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే మనకే కాదు.. భవిష్యత్తరాలకు కూడా మంచి వాతావరణాన్ని సమకూర్చిన వారమవుతాం.

### వ్యర్థాలతో..

### పెరిగిపోతున్న కాలుష్యం..

నగరంలో ఎక్కడ చూసినా వ్యర్థపదార్థాలు గుట్టలుగుట్టలుగా పడివుంటున్నాయి. వాటిని శుభ్రం చేసేవారే లేరు. ప్లాస్టిక్‌కవర్ల వల్ల కలిగే అనర్థాలను గుర్తించి రాష్ట్రప్రభుత్వం ఇటీవలే వాటిని నిషేధించింది కనుక, వాటిని వాడకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్‌కవర్ల వాడకాన్ని మనకు మనమే నిషేధించుకుని పర్యావరణానికి మనవంతు మేలుచేద్దాం.. అనే భావన అందరిలో కలగాలి. మనకు స్వచ్ఛమైన గాలులతో ప్రాణవాయువునిచ్చి బతికించే ప్రకృతిని ప్రతిఒక్కరూ ప్రేమించాలి. పచ్చదనాన్ని-పరిశుభ్రతను ఎల్లవేళలా కాపాడుకోవాలి. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి..అన్నిటికీ మించి కాలుష్యాన్ని అరికట్టడాన్ని అందరూ తక్షణ కర్తవ్యంగా భావించాలి. అప్పుడే ఈ బాధల నుంచి.. నరకయాతనల నుంచి నెల్లూరుకు మోక్షం!.

### సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# 21న కవిసమ్మేళనం

నెల్లూరులోని సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 21న 'సిపి బ్రౌన్-తెలుగుభాష' అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహిస్తున్నామని ట్రస్ట్ అధ్యక్షుడు సర్వేపల్లి రామమూర్తి, ఉపాధ్యక్షుడు సర్వేపల్లి ప్రభాకర్‌రావు, కోశాధికారి సర్వేపల్లి శివకుమార్‌లు తెలియజేశారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు నగరంలోని టౌన్‌హాలు ప్రాంగణంలో ఉన్న రీడింగ్‌రూమ్‌లో జరిగే ఈ కవిసమ్మేళనంలో ప్రధాన ఉపన్యాసకులుగా అన్నదాత మణి (ప్రాసమణి), ప్రముఖ అవధాని కోట రాజశేఖర్, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రముఖ రచయితలు కొర్రపాటి వెంకటరమణ, త్వరకవి వేంకట బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొంటారని, అనంతరం వారిని ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. తెలుగుభాషాభివృద్ధికి ఎనలేని సేవలు చేసిన సిపి బ్రౌన్‌పై జిల్లాలో కవిసమ్మేళనం నిర్వహించడం ఇదే తొలిసారి అని, పెద్దసంఖ్యలో కవులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

### కారంచేడు

# మృతవీరులకు నివాళులు

కారంచేడు దళితులు నరమేధానికి గురై 34 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దళిత విద్యార్థి సేన, ఏపి దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవ పూర్ణప్రకాష్ ఆధ్వర్యంలో దళిత మృత వీరులకు నివాళులర్పించారు. నెల్లూరు అంబేద్కర్ భవన్‌లో ఈనెల 17న జరిగిన విలేకర్ల సమావేశంలో పూర్ణ ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 27న జిల్లాలోని 56 దళిత సంఘాలు తరపున కారంచేడు దళిత మృత వీరుల సంతాపసభను ఏర్పాటు చేస్తున్నామని జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం గావించాలని కోరారు. ఈ సమావేశంలో కొమరగిరి అమర్, కత్తి పుల్లయ్య, షేక్ బాబు, కె.శ్రావణ్ కుమార్, కె.సాయి, పి.శేఖర్, మహేష్, నాని పాల్గొన్నారు.



టీడీపీ నాయకులతో సమావేశమైన మాజీమంత్రులు సోమిరెడ్డి, నారాయణ

# దాడులను ధీటుగా ఎదుర్కొందాం

## - టీడీపీ నాయకులు

జిల్లాలో తెలుగుదేశం నాయకుల ఆస్తులపై జరుగుతున్న దాడులను ధీటుగా ఎదుర్కోవాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. 17వ తేదీన నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలు జిల్లా తెలుగుదేశం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టి.పి.గూడూరు మండలం కొత్తకోడూరు వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులకు చెందిన రొయ్యలగుంటలను ధ్వంసం చేయడాన్ని ఖండించారు. రాజకీయ కక్షలతో ఇలా ఆస్తులను ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. జిల్లాలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదని, 90లక్షల పెట్టుబడితో చేపట్టిన రొయ్యల సాగును ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్యగా వాళ్ళు అభివర్ణించారు. వైసిపి నాయకుల దౌర్జన్యాలను కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తెలుగుదేశం కార్యకర్తలను ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసని, దౌర్జన్యాలతో తెలుగుదేశం కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు.

ఈ సమావేశానికి జిల్లా టీడీపీ నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టి.అనూరాధ, ఖాజావలి, అన్నం దయాకర్‌గౌడ్, చాట్ల నరసింహారావు, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

# కరాటేలో మౌర్యకు బంగారు పతకం

నెల్లూరు జిల్లా కలివెలపాలెం రెయిన్‌బో సీబీయస్‌ఈ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కోలపల్లి మౌర్య ఇటీవల జిల్లాలో జరిగిన తైక్వాండో కరాటే పోటీల్లో 30-35 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు. నెల్లూరు నవాబుపేటకు చెందిన కోలపల్లి దివాకర్, రేఖ దంపతుల కుమారుడు మౌర్య. బంగారు పతకం సాధించేందుకు మౌర్యకు శిక్షణ ఇచ్చిన గురువు శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.



# 75.63 కోట్లతో డిసిసిబి బడ్జెట్



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గ సమావేశం మరియు మహాజన సభ సమావేశం ఈ నెల 17వ తేదీన నెల్లూరులోని బ్యాంకు సమావేశ మందిరంలో జరిగాయి. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ 2019-20 సంవత్సరానికి 75.63 కోట్లు బ్యాంకు యొక్క అంచనా బడ్జెట్‌ను ఆమోదించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 'పేదరికంపై గెలుపు' పథకం క్రింద జిల్లా కలెక్టర్ సిఫారసుల మేరకు వివిధ వర్గాల ప్రజలకు 322.20 లక్షల వరకు ఋణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ఏడాది 8.74 కోట్లు దీర్ఘకాలిక ఋణాలు అందజేశామని, సహకార పరపతి సంఘాల ద్వారా సి.కె.సి.సి విధానంలో స్వల్పకాలిక అప్పులు తీసుకున్నవారికి ఏదైనా ప్రమాదం జరిగితే అతి తక్కువ ప్రీమియంలో లక్ష రూపాయల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. రైతులకు ఇస్తున్న దీర్ఘకాలిక ఋణాలపై వడ్డీని 11.90 శాతానికి, స్వల్పకాలిక ఋణాల వడ్డీని 11.85 శాతానికి తగ్గించడం జరిగిందని ఆయన తెలిపారు.

# రియల్ ఎస్టేట్‌ను నిలబెట్టండి

## - రాజ్యసభలో విపిఆర్



నానాటికీ కుదేలవుతున్న రియల్ ఎస్టేట్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాజ్యసభలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. 17వ తేదీ రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో వచ్చిన సంక్షోభం వల్ల లక్షలాది మంది ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయని, రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవడానికి ఏం చర్యలు చేపట్టాలో చెప్పాలని ఆయన కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రిని ప్రశ్నించారు. దీనిపై సదరు మంత్రి హర్దీప్‌సింగ్‌పూరి సమాధానమిస్తూ కష్టాల్లో వున్న రియల్ ఎస్టేట్ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందని, రియల్ ఎస్టేట్ రంగాన్ని క్రమబద్ధీకరించడానికి, ప్రోత్సహించడానికి రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. విమానభద్రతపై కూడా ఈ సభలో విపిఆర్ ప్రశ్నించారు. అలాగే దేశవ్యాప్తంగా డి అడిక్షన్ క్యాంపుల ఏర్పాటు గురించి ప్రశ్నించారు.

### మత్స్యకారులకు వెల్‌నెస్ సెంటర్లు ఎక్కడ..?

16వ తేదీ రాజ్యసభలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మత్స్యకారుల వెల్‌నెస్ సెంటర్‌ల గురించి అడిగారు. దీనికి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అశ్వనికుమార్ చౌబే సమాధానమిస్తూ బడ్జెట్‌లో ప్రకటనకు అనుగుణంగా 2017-18 సంవత్సరానికిగాను దేశ వ్యాప్తంగా 15లక్షల హెల్త్ అండ్ వెల్‌నెస్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మత్స్యకారులతో సహా అన్ని వర్గాల ప్రజలకు కమ్యూనిటీ స్థాయిలో ప్రివెంటివ్ హెల్త్‌కేర్, హెల్త్ ప్రమోషన్ కలిగిన నిరంతర ప్రాథమిక సంరక్షణ విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు.

### అవయవ అక్రమ ట్రేడింగ్‌పై...

అక్రమ అవయవ ట్రేడింగ్ నిరోధానికి, దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందని వేమిరెడ్డి ప్రశ్నించారు. దీనిపై కూడా అశ్వనీకుమార్ సమాధానమిస్తూ అవయవాల అక్రమ మార్పిడి నిరోధానికి తగిన చర్యలు చేపట్టడం జరిగిందని, అవయవ దానంపై దేశ వ్యాప్తంగా సంబంధిత శాఖల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అలాగే 15వ తేదీ జరిగిన చర్చలో వేమిరెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం, వ్యయంపై ప్రశ్నించారు.

# భవిష్యత్ బీజేపీదే

## - నెల్లూరులో కన్నా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ఈ నెల 17వ తేదీన జిల్లాలో పర్యటించారు. ముందుగా జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం వేదాయపాలెంలో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలోనూ, టీపీ గూడూరు మండలం నరుకూరు సెంటర్‌లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏపిలో బీజేపీకి మంచి భవిష్యత్ వుందని, పార్టీ ప్రబలశక్తిగా ఎదగబోతుందని చెప్పారు. పార్టీలో చేరాలనుకుంటున్న వారిని ఆహ్వానిస్తున్నామని, పార్టీ పురోభివృద్ధికి ప్రతి కార్యకర్త పాటుపడాలన్నారు. గత ఐదేళ్లలో తెలుగుదేశం ప్రభుత్వం ఏ తప్పులైతే చేసిందో వైసిపి ప్రభుత్వం కూడా అవే తప్పులు చేస్తోందని, ఇద్దరికీ పెద్ద తేడా కనిపించడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటంలో వెనక్కు తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. త్వరలో తెలుగుదేశం పార్టీ నుండి బీజేపీలోకి భారీగా వలసలుంటాయన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కరణం భాస్కర్, ఆర్‌డి విల్సన్, కందుకూరి సత్యనారాయణ, గద్దం విజయకుమార్, సతీష్, ఎం.ఈశ్వరయ్య, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కన్నా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

# అవినీతిని తన్ని తరిమేద్దాం!

## పిలుపునిచ్చిన ఎస్పీ ఐశ్వర్య రస్తోగి



ప్రభుత్వ కార్యాలయం నుండి అవినీతిని తరిమేయాలంటున్న ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆలోచనా విధానాన్ని ఆచరణలో పెట్టడానికి జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి పూనుకున్నారు.

అవినీతి, లంచాలు అంటే రెవెన్యూ కార్యాలయాల తర్వాత గుర్తొచ్చేది పోలీసు స్టేషన్‌లే! ఈ నేపథ్యంలోనే 17వ తేదీ నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ ఐశ్వర్య రస్తోగి తమ శాఖలోని ప్రతి అధికారికి, సిబ్బందికి ఘాటుగా హెచ్చరికలు జారీ చేశాడు. క్రింది స్థాయి నుండి పైస్థాయి అధికారి వరకు ప్రతిఒక్కరూ అవినీతికి దూరంగా వుండాలని హెచ్చరించారు. అవినీతికి పాల్పడినా, విధి నిర్వహణలో దిగజారి ప్రవర్తించినా అలాంటివారిపై కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడబోనని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిజాయితీగా వుండేవారికి తన పూర్తి సహకారం వుంటుందని, వారి వృత్తిపరమైన ఎదుగుదలకు అండగా నిలుస్తానని చెప్పారు. సమస్యల మీద పోలీసుస్టేషన్‌కు ఎవరు వచ్చినా వాళ్ళు తిరిగి సంతోషంగా వెళ్లేలా మన పనితీరు వుండాలని ఆయన సూచించారు.

## 'ప్రభా'తం

# వివాదాస్పద విజయం



వరల్డ్‌కప్‌లో ఇంగ్లాండ్ అన్ని విభాగాలలోనూ రాణించింది. ప్రపంచకప్‌కు అర్హత వున్న జట్టే. కాని, న్యూజిలాండ్‌ను ఏ ఆధారం లేకుండా పరాజితగా ప్రకటించడమే క్రీడా మేధావులు, అభిమానులు హర్షించలేకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా న్యూజిలాండ్‌కు మద్దతు పెరుగుతోంది. సెమీఫైనల్స్‌లో అదృష్టం కొద్ది భారత్ మీద న్యూజిలాండ్ గెలిచింది. అయినా కూడా భారతీయ క్రికెట్ అభిమానులు ఫైనల్ ఉదంతంలో న్యూజిలాండ్‌కు అన్యాయం జరిగిందంటూ ఆవేదన చెందుతున్నారు.

పదకొండు మంది పనిలేనివాళ్ళు ఆడుతుంటే పదకొండు వేలమంది పనులు మానుకుని చూస్తుంటారని బెర్నార్డ్‌షా క్రికెట్ గురించి ఎప్పుడో చెప్పారు. ఆయన ఈ మాట చెప్పినప్పుడు పనులు మానుకుని చూసేవాళ్ళు 11వేల మందే వున్నారేమో... ఇప్పుడైతే ఖచ్చితంగా నూట పదకొండు కోట్ల మంది ఆ విధంగా పనులు మానుకుని చూసే వాళ్ళున్నారు. క్రీడలలో క్రికెట్ అంత చెత్త క్రీడ ఇంకోటి లేదని చాలామంది క్రీడా పండితుల అభిప్రాయం. ఎందుకంటే ఈ ఆట సమయాన్ని వృధా చేస్తుంది. ఏ ఆట అయినా గంట నుండి రెండు గంటలలోపు ఫలితాన్ని నిర్దేశిస్తుంది. కాని క్రికెట్‌లో మాత్రమే వన్డే మ్యాచ్ అంటే ఒకరోజు టెస్ట్ మ్యాచ్ అంటే ఐదురోజులు పనిదినాలు వృధా అయిపోతాయి. అదీగాక క్రికెట్‌లో పూర్తిగా ప్రతిభతోనే ఫలితాలు రావు. అప్పుడప్పుడు అదృష్టం ఫలితాన్ని, విజేతను నిర్దేశిస్తుంది. క్రికెట్ చరిత్రలో ఇలాంటి అదృష్ట అద్భుత ఘట్టాలు మనకు అడుగడుగునా తారసపడుతూనే వుంటాయి.

ఒకటిన్నర నెలపాటు క్రికెట్‌కు పుట్టినిల్లయిన ఇంగ్లాండ్ వేదికపై జరిగిన ప్రపంచకప్ క్రికెట్ పోటీలలోనూ ఆటలోని ప్రతిభ కంటే అదృష్టమే విశ్వ విజేతను నిర్ణయించడం క్రీడా పండితులను విస్మయానికి, క్రీడాభిమానులను విచారానికి, కాలం కలిసిరాని పరాజితులను విషాదానికి గురిచేసింది.

క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు మనం ఓటమిని పరుగుల తేడాలోనో, లేక వికెట్ల తేడాలోనో మాత్రమే చూస్తూ వచ్చాం. కాని తొలిసారి బౌండరీల తేడాతో ఒక జట్టు ఓడిపోవడం ఇంకో జట్టు ప్రపంచకప్ విజేతగా నిలవడం చూశాం. జూలై 15వ తేదీ లండన్‌లోని లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ - న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ సున్నా పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తుచేసి ప్రపంచకప్‌ను చేజిక్కించుకుంది. ప్రపంచానికి క్రికెట్‌ను పరిచయం చేసిన దేశంగా ప్రసిద్ధిగాంచి కూడా ఆ దేశం నాలుగు దశాబ్దాలుగా వరల్డ్ కప్ కోసం ఉవ్విళ్లూరింది. మూడుసార్లు ఫైనల్ దాకా వచ్చి కప్ ముంగిట బొక్కబోర్లా పడింది. ఈసారి మాత్రం ఆటతో పాటు అదృష్టం కూడా కలిసొచ్చి కప్‌ను ఒడిసి పట్టింది. ఇంగ్లాండ్ విజయంలో ఆ జట్టు సభ్యులే కాదు, అంపైర్లు, ఐసిసి నిబంధనలు కూడా తమవంతు సహకారం అందించాయి.

వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 50ఓవర్లలో 241పరుగులకు సరిగ్గా ఆలౌట్ అయ్యింది. ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయించాలని అంపైర్లు నిర్ణయించారు. అయితే ఇరు జట్లు సూపర్ ఓవర్‌లోనూ చెరి సమానంగా పరుగులు చేయడంతో ఇక ఐసిసి నిబంధనల బుక్ తిరగేశారు. ఐసిసి నిబంధనల ప్రకారం మ్యాచ్‌లో ఎక్కువ బౌండరీలు సాధించిన ఇంగ్లాండ్‌ను విజేతగా ప్రకటించడంతో న్యూజిలాండ్ క్రీడాకారులు కుప్పకూలిపోయారు.

ఇలా ఐసిసి చెత్త నిబంధన ఒకటి న్యూజిలాండ్‌కు ప్రపంచ కప్‌ను దూరం చేయగా, మ్యాచ్‌లో అంపైర్ తప్పుడు నిర్ణయం కూడా ఆ జట్టుకు శాపంగా మారింది. ఇంగ్లాండ్ విజయానికి 3 బంతుల్లో 9 పరుగులు చేయాల్సిన దశలో బెన్‌స్టోక్స్ బ్యాట్‌కు తగిలిన ఓవర్ త్రో బంతి బౌండరీ లైన్ దాటింది. వాస్తవానికి బ్యాట్స్‌మెన్ అప్పటికి ఒక పరుగే పూర్తి చేశారు. బంతి బ్యాట్‌ను తగిలి వెళ్లిపోయాక దానిని బౌండరీగా పరిగణిస్తే ఐదు పరుగులే రావాలి. అప్పుడు ఇంగ్లాండ్ స్కోర్ 240 పరుగుల వద్దనే ఆగిపోయేది. కాని, అంపైర్ ధర్మసేన ఆ బంతికి ఆరు పరుగులివ్వడంతో న్యూజిలాండ్ వెన్ను విరిచేయడంలో ఆయన వంతు పాత్ర పోషించినట్లయ్యింది. మొత్తం మీద చూస్తే ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్ ఓడిపోలేదు. ఇంగ్లాండ్ గెలవనూలేదు. ఐసిసి నిబంధనలు, అంపైర్ ధర్మసేన కలిసి కప్‌ను ఇంగ్లాండ్ చేతిలో పెట్టారు. ఫైనల్ మ్యాచ్‌లో ప్రతిభ ఆధారంగా చూస్తే న్యాయంగా విజేతగా నిలవాల్సింది న్యూజిలాండ్ జట్టే. ఎందుకంటే ఇంగ్లాండ్ తరఫున 11మంది బ్యాట్స్‌మెన్‌లు రంగంలోకి దిగి 241 పరుగులు కొడితే, న్యూజిలాండ్ తరఫున 9మంది ఆటగాళ్లే ఆ స్కోర్ సాధించారు. అంటే ఇక్కడ రెండు వికెట్ల తేడా వుంది. ఇరు జట్ల స్కోరు సమం అయినప్పుడు ఇక్కడ వికెట్ల తేడాను పరిగణనలోకి తీసుకోవచ్చు. బౌండరీలను పరిగణనలోకి తీసుకోవడం అన్నది న్యాయబద్ధమైన సూత్రంగా అనిపించదు. బౌండరీలను గొప్పవిగా చూసి చూడడం అంటే మ్యాచ్‌లో సింగిల్స్, డబుల్స్, త్రిబుల్ రన్స్‌కు ప్రాధాన్యత లేనట్లేకదా! ఇదో పెద్ద చెత్త నిబంధన.

వరల్డ్‌కప్‌లో ఇంగ్లాండ్ అన్ని విభాగాలలోనూ రాణించింది. ప్రపంచకప్‌కు అర్హత వున్న జట్టే. కాని, న్యూజిలాండ్‌ను ఏ ఆధారం లేకుండా పరాజితగా ప్రకటించడమే క్రీడా మేధావులు, అభిమానులు హర్షించలేకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కూడా న్యూజిలాండ్‌కు మద్దతు పెరుగుతోంది. సెమీఫైనల్స్‌లో అదృష్టం కొద్ది భారత్ మీద న్యూజిలాండ్ గెలిచింది. అయినా కూడా భారతీయ క్రికెట్ అభిమానులు ఫైనల్ ఉదంతంలో న్యూజిలాండ్‌కు అన్యాయం జరిగిందంటూ ఆవేదన చెందుతున్నారు. ఎంతో పోరాట పటిమ చూపిన న్యూజిలాండ్ జట్టును ఏ కారణం లేకుండా ప్రపంచకప్‌కు దూరం చేయడాన్ని ఎవరూ అంగీకరించడం లేదు.

ఐసిసి నిబంధనలపై ప్రపంచవ్యాప్తంగా కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు బౌండరీల ద్వారా విజేతను నిర్ణయించడమనేది క్రికెట్ చరిత్రలోనే మొదటిసారిగా జరిగింది. తక్కువ బౌండరీలు కొట్టడం ద్వారా తాము ప్రపంచకప్‌ను అందుకోలేకపోయామనే బాధ న్యూజిలాండ్‌ను ఎప్పటికీ వెంటాడుతుంది. దీనికి బదులుగా మరో సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయించి వున్నా, లేదా ఇరు జట్లను సంయుక్త విజేతగా ప్రకటించి వున్నా క్రీడాస్ఫూర్తి చాటుకున్నట్లుండేది!

# పాత జ్ఞాపకాలతో పులకించిపోయారు

## 1969 బ్యాచ్ పాలిటెక్నిక్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

వారంతా నెల్లూరులో ఒకప్పుడు పాలిటెక్నిక్ చదువుకున్న విద్యార్థులు. ఇప్పుడు ఎక్కడెక్కడో మంచిస్థాయిలోనే ఉద్యోగాలు చేస్తూ జీవితాలు గడుపుతున్నారు. వారంతా ఒక్కసారి తమకు విద్యను అందించిన నెల్లూరుకు వచ్చి ఆత్మీయంగా కలుసుకోవాలని ఉబలాటపడ్డారు. ఆ ఆనందానికి నగరంలోని ఓ హోటల్ వేదికైంది. అనుకున్నట్లుగానే అందరూ వచ్చి అపూర్వమైన రీతిలో సమ్మేళనం నిర్వహించుకున్నారు. నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1969 బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థుల వేడుక ఇది. ఈనెల 14న ఆదివారం రోజున అందరూ కలుసుకుని ఆ రోజంతా సరదాగా గడుపుతూ పాతజ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ ఎంతగానో మురిసిపోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ, జోక్స్ వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఢిల్లీ, చెన్నై తదితర దూరప్రాంతాల్లో ఇప్పుడు మంచి హోదాల్లో ఉన్న వారు కూడా వచ్చి ఈ సమ్మేళనంలో పాల్గొనడం విశేషం.

ఈ అపూర్వ కార్యక్రమానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ విశ్రాంత ప్రిన్సిపాల్ కొండా బలరామరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అందరూ అప్యాయంగా ప్రేమానురాగాలతో జీవించాలన్నారు. మనిషికి ధనమే ముఖ్యం కాదని.. సమాజానికి సేవచేసి అందరూ తమ జీవితాలను సార్ధకం చేసుకోవాలన్నారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ వై.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ తాను ఇదే కళాశాలలో చదువుతూ, బలరామరెడ్డి దగ్గరే పనిచేసి ఇదే కళాశాలకు ప్రిన్సిపాల్‌ని అయ్యానంటూ సంతోషంగా చెప్పారు. పూర్వ విద్యార్థులు నాగేశ్వరరావు, రామారావు, సుధాకర్‌బాబు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, డిసిపి హెడ్ మధుసూదన్‌రెడ్డి, రవికృష్ణ, మురళీమోహన్‌శర్మ, కె.మనోహర్, శుకదేవయ్య పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ హుండీ ఆదాయం 14.31 లక్షలు

చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువైవున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో హుండీని ఈనెల 14న లెక్కించగా 58 రోజులకు గాను మొత్తం 14,31,759 రూపాయలు వచ్చిందని ఆలయ ఇ.ఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఛైర్మెన్ ఆనందరెడ్డి, సభ్యులు అంబరీష, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# పనులు స్థంభించాయి

ఇసుక తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధం వల్ల నిర్మాణ రంగం స్థంభించిపోయింది. దీనిమూలంగా ప్రత్యక్షంగా పరోక్షంగా ఎన్నో లక్షల మంది కార్మికులకు పనిలేకుండా పోయింది. వాళ్లకు బ్రతుకుదెరువు లేదు. నిర్మాణ రంగంపై ఆధారపడి వున్న వ్యాపార కార్యకలాపాలు ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని సెప్టెంబర్ 5వ తేదీ నుండి అమలులోకి తెస్తామంటోంది. అప్పటిదాకా నిర్మాణ రంగం స్థంభించిపోవాల్సిందేనా? దీనిబదులు ఇసుకపై పాత ప్రభుత్వ పాలసీనే సెప్టెంబర్ 5 దాకా అమలు చేస్తే పనులు ఆగవు కదా? ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి.

**దయాసాగర్‌రెడ్డి, అనంతసాగరం.**

## మా వీధిలో కుక్కలంటే హడల్

నెల్లూరు, పొదలకూరురోడ్డు లేక్‌వ్యూ కాలనీలోని 9వ వీధిలో ఓ ఇంటిలో అద్దెకుంటున్న వాళ్ళు ఆరు కుక్కలను సాకుతున్నారు. తెల్లారుజామున మూడుగంటలకు వాటిని వదిలేస్తారు. ఇక రాత్రిదాకా వాటి ఆగడాలు భరించలేక మా వీధి వాళ్ళు హడలెత్తిపోతున్నారు. వీధిలో పోయే వారిపై అరుస్తూ దూకడం, వాహనాలను వెంబడించడం వంటివి చేస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు వీటి బాధ నుండి ఈ వీధి వాసులకు విముక్తి కల్పించాలని మనవి.

**షేక్ ఖాదర్‌బాషా, నెల్లూరు.**

## దర్శనంపై పరిమితి

విఐపిలు ఏడాదికొకసారే శ్రీవారిని దర్శించుకునేలా పరిమితి విధించాలనే టిటిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి ఆలోచన మంచిదే! విఐపిలు నెలకోసారి, కొందరైతే వారానికోసారి కూడా వస్తుంటారు. ఎంతోమంది భక్తులు పదేళ్లకోసారి కూడా స్వామి దర్శనం చేసుకోలేకపోతున్నారు. తిరుమలలో విఐపి ఫోబియాను తగ్గించి స్వామివారిని సామాన్యభక్తులకు చేరువచేయాలి.

**జి.పండరినాథ్, నెల్లూరు.**

## ఫైనల్‌లోనూ అదృష్టమే గెలిచింది

న్యూజిలాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో అదృష్టం లేక ఇండియా ఓడిపోయింది. కేవలం వర్షం మూలంగానే ఆ మ్యాచ్‌లో జయాపజయాలు తారుమమారయ్యాయి. ఫైనల్ మ్యాచ్‌లోనూ అదృష్టం వల్లే ఇంగ్లాండ్ గెలిచింది. పరుగుల వేటలో ఇరు జట్లు సమంగా నిలిచినప్పటికీ ఎక్కువ బౌండరీల ఆధారంగా ప్రపంచ కప్ విజేతను నిర్ణయించారు. కేవలం క్రికెట్‌లో మాత్రమే మనం ఇలాంటి వింతలు చూడగలం.

**రాజశేఖర్, నెల్లూరు.**

## కాలువలు బాగుచేయండి

నెల్లూరురూరల్, వైయస్సార్ నగర్‌లోని మురికి కాలువలు పూడిపోయి వున్నాయి. దీంతో ఇళ్లలో వాడుకునే నీరు పారక ఇళ్ళ ముందే ఆగిపోయి దుర్గంధ భరితంగా మారుతోంది. స్వర్గీయ వై.యస్. హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వైయస్సార్ కాలనీని మాజీమంత్రి నారాయణ కాస్త అభివృద్ధి చేసినా.. పారిశుద్ధ్య పరంగా ఎటువంటి పనులు జరగలేదు. కనీసం చెత్తకుండీలు అయినా ఏర్పాటు చేయాలి. ఇప్పుడైనా ఈ కాలనీని అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

**జె.యస్.కృష్ణ, నెల్లూరు.**



## నగరంలో నరకం చూపిస్తున్న...

# మై'పాడు' రోడ్డు

### ☞ మంత్రివర్యా... ఈ దుస్థితి మార్చండి!

నెల్లూరు నగరంకు చుట్టుపక్కల ఊర్లకు వెళ్లేందుకు ఎన్నో రహదారులున్నాయి. నెల్లూరు – జొన్నవాడ, నెల్లూరు – ముత్తుకూరు, నెల్లూరు – గొలగమూడి, నెల్లూరు – పొదలకూరు, నెల్లూరు – బుచ్చిరెడ్డిపాలెం... అలాగే నెల్లూరు నుండి మైపాడురోడ్డు కూడా ఎంతో ముఖ్యమైనది. నెల్లూరు నుండి మైపాడుకు మధ్య దాదాపు 50గ్రామాలకు అనుసంధానంగా వుండే రోడ్డు ఇది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న మైపాడు బీచ్‌కు ప్రధాన మార్గమిదే! నిత్యం వందల సంఖ్యలో బస్సులు, వేల సంఖ్యలో ఇతర వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి.

ఎంతో ప్రాధాన్యతగల, ఎంతో వాహనాల రద్దీగల ఈ రోడ్డు నగర పరిధిలో ఆక్రమణలకు గురై వాహనదారులకు నరకం చూపిస్తోంది. నెల్లూరులోని పాత చెక్‌పోస్టు నుండి నారాయణరెడ్డిపేట వరకు ఈ రోడ్డుపై నిత్యం రద్దీగా వుంటుంది. రోడ్డు వెడల్పు లేకపోవడంతో పాటు పాత చెక్‌పోస్టు నుండి నవలాకులతోట దాకా రోడ్డు కిరువైపులా ఆక్రమణలెక్కువుగా వున్నాయి. జాఫర్‌సాహెబ్ కాలువ పక్కన ఇరిగేషన్ స్థలాలను సైతం ఆక్రమించి నివాసాలు ఏర్పరచుకుని వున్నారు. బోడిగాడితోట ప్రాంతంలో అయితే రోడ్డుకు ఆనుకునే గుడిసెలు... ఏ లారీ ఎప్పుడు ఆ గుడిసెల మీదకు దూసుకుపోతుందో... ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో తెలియని పరిస్థితి. ఈ గుడిసెల్లో పిల్లలు రోడ్లమీద ఆడుకుంటుంటారు. ఈ రోడ్డు మీదే వాహనాలు పరుగులు తీస్తుంటాయి. రోడ్డు కూడా గతుకులమయంగా వుంది. మంత్రిగా, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా అనిల్‌కుమార్ ఈ రోడ్డు రూపురేఖలు మార్చే దిశగా కృషి చేయాల్సివుంది. ఆక్రమణలు తొలగించడం, వారికి ప్రత్యామ్నాయ వసతి కల్పించడం, రహదారిని వెడల్పు చేయడం ద్వారా మైపాడురోడ్డుకు మెరుగులుదిద్దొచ్చు.



# పరుగులు పెడుతున్న రైళ్ళు

### ఆకర్షణగా మారుతున్న వెలుగొండ సొరంగ మార్గం

గత నెలలోనే మొదలైన కృష్ణపట్నం – ఓబులవారిపల్లె రైల్వేలైన్‌పై రవాణా రైళ్ళు పరుగులు తీస్తున్నాయి. భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు స్వప్నమైన ఈ రైల్వేలైన్‌పై రైళ్ళ రాకపోకలకు గత నెల చివరివారంలోనే పచ్చజెండా ఊపారు. ఈ మార్గంలోనే వెలుగొండల్లో సొరంగ మార్గం కూడా వుంది. దీని మూలంగానే ఈ రైల్వేలైన్‌ను రవాణాకు అందుబాటులోకి తేవడంలో కొంత ఆలస్యం జరిగింది. ఈ లైన్‌లో రాకపోకలు మొదలయ్యాక కృష్ణపట్నం పోర్టు నుండి ఎక్కువగా రవాణా రైళ్ళు ఈ మార్గంలోనే నడుస్తున్నాయి. ఇంతకుముందు కర్నాటక వైపు వెళ్లాలంటే గూడూరు, తిరుపతి మీదుగా, మహారాష్ట్ర వైపు పోవాలంటే గుంటూరు మీదుగా వెళ్లాల్సి వచ్చేది. కృష్ణపట్నం పోర్టుకు ఎక్కువగా అనంతపురం, బళ్లారి ప్రాంతాల నుండే రవాణా వుంది. ఈ కొత్త లైన్ రావడంతో దాదాపు 90కిలోమీటర్ల ప్రయాణ దూరం తగ్గి రవాణా ఖర్చు భారీగా తగ్గుతోంది. రోడ్డు రవాణా కంటే రైలు రవాణా సలీసు అవుతుంది. కాబట్టే ఈ లైన్ అందుబాటులోకి వచ్చిన నెలరోజుల్లోపే భారీగా ఈ లైన్‌పై రవాణా రైళ్ళ రాకపోకలు పెరగడం విశేషం.

# జాబిలి యాత్రకు బ్రేక్

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తల ప్రతిభ చందమామ అంచులను తాకే అద్భుత దృశ్యాన్ని కళ్ళారా చూద్దామని భారత ప్రథమ పౌరుడు రామ్‌నాథ్ కోవింద్ అదిపనిగా షార్ సెంటర్‌కు వచ్చాడు. వస్తూ వస్తూ ఆయన తిరుమల వెళ్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మరీ వచ్చాడు. కొన్నివేల మంది షార్ సెంటర్‌లో కనురెప్పలు కూడా మూయకుండా అర్ధరాత్రి దాటాక కూడా ఆ అద్భుత క్షణాల కోసం వేచిచూశారు. కొన్ని లక్షల మందైతే టీవీల ముందు కూర్చుని నిద్రమత్తు ఆవహిస్తున్నా దానిని సైతం అధిగమించి ఆ ప్రయోగ వీక్షణకై వేచిచూశారు. సరిగ్గా ఆ సమయంలోనే నిరాశపరిచే వార్త... చంద్రయాన్–2 ప్రయోగం ఆగిపోయిందని... కారణం చివరి గంటలో రాకెట్‌లో కనిపెట్టిన సాంకేతిక లోపం.

దాదాపు నెలరోజులుగా దేశం యావత్తూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన చంద్రయాన్–2 ప్రయోగం ఆగిపోయింది. ఈ నెల 15వ తేదీ వేకువజామున 2.51 గంటలకు జిఎస్ఎల్వి–మార్క్3 ద్వారా చంద్రయాన్–2 ప్రయోగానికి అంతా సిద్ధమైంది. ఇస్రో శాస్త్రవేత్తలు పూర్తి సన్నాహాల్లో మునిగివుండగా, ప్రయోగానికి 56 నిముషాల ముందు మూడోదశలోని క్రయోజనిక్ ఇంజన్‌లో లోపం గుర్తించడంతో కౌంట్‌డౌన్ నిలిపేశారు.

### ఏది జరిగినా మన మంచికే...

'ఏది జరిగినా మన మంచికే' అనే సామెతను చంద్రయాన్ –2కు కూడా అన్వయించవచ్చు. 56 నిముషాల ముందు రాకెట్‌లో సాంకేతిక సమస్యను గుర్తించబట్టి సరిపోయింది. అలా గుర్తించక ప్రయోగం జరిపివుంటే వాహకనౌక కూలిపోయేది. లేదంటే శాస్త్రవేత్తలే కూల్చాల్సి వచ్చేది. దాదాపు వెయ్యికోట్లతో చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ఇది. డబ్బే కాదు... ఏళ్ళ తరబడి ఇస్రో శాస్త్రవేత్తల శ్రమ. భారత ప్రతిష్ట కూడా సముద్రం పాలయ్యేది.




### తొందరలోనే వుండొచ్చు..

చంద్రయాన్–2 ప్రయోగం బహుశా ఈ ఏడాదిలోనే ఖచ్చితంగా వుండొచ్చు. వాహకనౌకలో తలెత్తిన సాంకేతిక లోపం చిన్నదైతే ఒకటి రెండు నెలల్లోనే దానిని సరిదిద్ది ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు. పెద్ద లోపమైతే వాహకనౌకను పూర్తిగా విప్పతీసి లోపాలను సరిచేసి పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాల్సివుంటుంది. ఏదేమైనా ప్రయోగం ఎప్పుడన్నది తొందరలోనే వెల్లడించే అవకాశముంది.

# బరిలో గిరి

### నెల్లూరు రూరల్ వైసిపి కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



ఇప్పటిదాకా అతను తెరవెనుకే పని చేశాడు. తనకు పేరు కావాలనుకోలేదు. కీర్తి కోరుకోలేదు. తన అన్నను ఎమ్మెల్యేగా, ఓ గొప్ప ప్రజానాయకుడిగా చూడాలనుకున్నాడు. అందుకోసమే కష్టపడ్డాడు. తన అన్నను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం ద్వారా తన కలను నెరవేర్చుకున్నాడు. తన అన్న రాజకీయ ఉన్నతిని కోరుకున్న ఆ తమ్ముడే కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి. నెల్లూరుగ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తమ్ముడు. 2014 ఎన్నికలలోనూ, 2019 ఎన్నికలలోనూ వైసిపి అభ్యర్థిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపు కోసం గిరిధర్‌రెడ్డి ఎంతగా కష్టపడ్డాడన్నది చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

అయితే తన జైత్రయాత్రలో తన తమ్ముడి కష్టాన్ని గుర్తించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి... ఇక నుండి రాజకీయ తెరపై తన తమ్ముడిని ప్రత్యక్షంగా చూపించాలనుకున్నాడు. ఈ ఆలోచనతోనే నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయ ఇన్‌ఛార్జ్‌గా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని నియమించారు. ఈమేరకు రూరల్‌లోని పార్టీ కేడర్‌కు కూడా స్పష్టమైన సంకేతాలిచ్చారు. వివిధ కారణాల రీత్యా ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డి ఒకవేళ అందుబాటులో లేకున్నా రూరల్ కార్యాలయంలో ప్రతిరోజూ గిరిధర్‌రెడ్డి అందుబాటులో వుంటారు. రూరల్ ప్రజల సమస్యలను తెలుసుకోవడంలోనూ, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడంలోనూ ఇక గిరిధర్‌రెడ్డి తన అన్నలాంటి పాత్రనే పోషించబోతున్నాడు. ఇప్పటికే గిరిధర్ ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ శేష గిరిబాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, అలాగే మరికొందరు పెద్దలను కలిసి వారి సంపూర్ణ ఆశీస్సులు కావాలని కోరడం జరిగింది.



వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# రోడ్లను ఆక్రమిస్తే జరిమానాలు



రోడ్డు ఆక్రమణలను పరిశీలిస్తున్న కలెక్టర్ శేషగిరిబాబు

జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఇటీవల నెల్లూరు నగరంలో పర్యటించారు. నగర అందాలను తిలకించారు. పలు ప్రాంతాలలో రోడ్లను ఆక్రమించుకునే షాపులు పెట్టి వుండడం, రోడ్లపైనే కంకర, ఇటుక, ఇసుక వంటివి వేసి నిర్మాణాలు చేస్తుండడం వంటివి చూశారు. వీటిని చూశాక ఆయనకు అరికాల్లో మండింది. రోడ్లను ఇలా ఆక్రమించేస్తే ఇక జనం ఎలా నడవాలి, వాహనాలు ఎలా నడపాలి అని కార్పొరేషన్ అధికారులను ప్రశ్నించారు. ఇక ఎవరు రోడ్లను ఆక్రమించి ఇలాంటి పనులు చేసినా జరిమానాలు విధించాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు.

## తెగిన వైర్లు - ఆగిన రైళ్ళు

ఈ నెల 13వ తేదీ సాయంత్రం నెల్లూరులోని పెన్నా వంతెన వద్ద, అలాగే వేదాయపాలెం - వెంకటాచలం రైల్వేస్టేషన్‌ల మధ్య రెండు చోట్ల రైల్వే ట్రాక్‌పై కరెంట్ వైర్లు తెగిపోయాయి. విజయవాడ వైపు వెళ్లే మార్గంలో వైర్లు తెగిపోవడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్, విశాఖ వైపు వెళ్లే ప్రధాన రైళ్లన్నీ ఆ టైంలోనే వస్తాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో ఎక్కడి రైళ్లు అక్కడే నిలిచిపోయాయి. విద్యుత్ తీగలను రాత్రి 10.30 గంటలకు సరిచేశారు. అప్పుడు రైళ్లు కదిలాయి. రాత్రి 7.25 గంటలకు నెల్లూరు రావాల్సిన సింహపురి ఎక్స్‌ప్రెస్ 11గంటలకు వచ్చింది. ప్రతి రైలు కూడా నాలుగైదు గంటలు ఆలస్యంగా నడిచింది. దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారు.

## లాయర్స్ జోష్

రాష్ట్ర బడ్జెట్‌లో న్యాయవాదులకు 100కోట్లు, అలాగే జూనియర్ న్యాయవాదులకు నెలకు 5వేలు స్టైఫండ్ ఇచ్చేలా 10కోట్లు కేటాయించినందుకు నెల్లూరులోని న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు. 15వ తేదీ నెల్లూరులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు స్వీట్లు పంచుకున్నారు. నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలోనూ అలాగే వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలోనూ ఈ సంబరాలు వేర్వేరుగా జరిగాయి. ఈ సంబరాల్లో ఏపి బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఫణి రత్నం, రాజారెడ్డి, న్యాయవాదులు రమణారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, అయ్యపరెడ్డి, గూడూరు సుబ్బారెడ్డి, సుభాని, భాను, రమణ, వైసిపి లీగల్ సెల్ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కుడుముల రవికుమార్, మురళీధర్‌రెడ్డి, అజాంహుస్సేని, రత్నం, లతీఫ్ బాషా, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ ఏ.డిగా వెంకటేశ్వరరెడ్డి

జిల్లా భూగర్భ గనుల శాఖ ఏ.డిగా వెంకటేశ్వర రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ ఏ.డిగా వున్న రాజశేఖర్‌ను పలు అవినీతి ఆరోపణల మీద ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఇక ఏ.డిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరెడ్డి గతంలోనూ ఇక్కడే ఇదే పోస్ట్‌లో పనిచేసి వున్నారు.

# నెల్లూరు కబుర్లు

## అందరూ రాజధానిలోనే...

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, 8మంది శాసన సభ్యులు రాజధానిలోనే వుంటున్నారు. ఈ నెలాఖరు దాకా అసెంబ్లీ సమావేశాలు వుండడంతో శని, ఆది వారాలలో మాత్రమే వీళ్ళు తమ నియోజకవర్గాలకు వచ్చే అవకాశముంది. ఇంకా కూడా పలు శాఖల్లో బదిలీలు పూర్తి కాకపోవడంతో ఉద్యోగులు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం విజయవాడ, అమరావతిలకు పరుగులు తీస్తున్నారు.

## ఇంకా తగ్గని ఎండలు

జూలైనెల కూడా సగం దాటేశాం... కాని కాస్తున్న ఎండలు వేసవికాలాన్ని ఇంకా దాటలేదనిపిస్తున్నాయి. ఎండలు మే నెలను తలపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు ఏ మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. బాగా ఎండ కాసిన రోజు సాయంత్రానికి ఆకాశం మేఘావృతమవుతుంది. అది చూసి అందరూ మంచి వర్షం పడుతుందని ఆశపడుతారు... కాని నాలుగంటే నాలుగే చినుకులు రాలి ఆశలపై నీళ్ళు చల్లుతాయి. జనం ఆశలతో మబ్బులు కూడా దోబూచులాడుతున్నాయి. విరగ కాస్తున్న ఎండలకు నెల్లూరు నగరమే ఎండిపోతున్నట్లుగా వుంది.

## టౌన్‌ప్లానింగ్‌లో రమేష్

నెల్లూరు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా రమేష్‌బాబు 15వ తేదీ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపాల్టీలో టిపిఓగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు.

## జిల్లా మలేరియా అధికారిగా మనోరమ

జిల్లా మలేరియా నివారణాధికారిగా మనోరమ నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా మలేరియా నివారణాధికారిగా పనిచేస్తూ ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. 15వ తేదీ నెల్లూరు సంతపేటలోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు.

## కమిషనర్‌గా మళ్ళీ మూర్తి



గత కౌన్సిల్ హయాంలో తగవులు తంటాలు తట్టుకోలేక ఇక్కడ పోస్టింగ్ వద్దురా బాబు అంటూ వెళ్లిపోయిన పి.వి.వి.ఎస్. మూర్తి మళ్ళీ నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా వచ్చారు. ఈ నెల 14వ తేదీన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయంలో పని చేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ కమిషనర్‌గా వున్న ఆలీం బాషాను అనంతపురం ఆర్జేడీగా బదిలీ చేశారు. ఆలీం బాషా 2017డిసెంబర్‌లో నెల్లూరుకు వచ్చారు. 19 నెలల పాటు వివాదాలకు దూరంగా పద్ధతిగా పనిచేశారు. ఇక కొత్త కమిషనర్‌గా వచ్చిన పి.వి.వి.ఎస్.మూర్తికి నెల్లూరు కార్పొరేషన్ పాతదే! 2015లో ఇక్కడ ఆరు నెలల పాటు ఆయన కమిషనర్‌గా పనిచేశారు. అప్పట్లో ఆరు నెలలకోసారి కమిషనర్‌ను మార్చే అనధికార సాంప్రదాయం వుండడంతో ఆయన ఆరు నెలలు మించి వుండలేకపోయారు. వివాదాలకు, అక్రమాలకు తావు లేకుండా పని చేస్తాడనే పేరుంది. ఆ పేరును నిలబెట్టుకునేలా పనిచేస్తే మంచిది.

## ఎస్.ఇగా ఇమామ్

నెల్లూరు కార్పొరేషన్ ఎస్.ఇగా ఇమామ్ మొహిద్దీన్‌ను నియమించారు. ప్రస్తుతం ఈయన సెలవులో వున్నారు. కొద్దికాలం క్రితం ఉద్యోగానికి రాజీనామా కూడా చేయగా దానిని పెండింగ్‌లో పెట్టారు. నిజాయితీపరుడైన అధికారిగా పేరుంది. ఇక్కడ ఎస్.ఇగా వున్న రవికృష్ణమరాజును గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీ చేశారు.

## ఇరుకళల పరమేశ్వరీదేవి ఆలయ ఇ.ఓగా ప్రసాద్



నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఇ.ఓగా కెవిపి ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు గ్రూపు ఆలయాల ఇ.ఓగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు.

## డి.ఇ.ఓగా బాధ్యతలు తీసుకున్న జనార్ధన్ ఆచారి



జిల్లా విద్యాశాఖాధికారిగా ఎం.జనార్ధనాచారి ఈ నెల 13వ తేదీన నెల్లూరులోని డిఇఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని, పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయుల చేత పనిచేయిస్తానని, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ బళ్లకు ధీటుగా మలుస్తానని ఆయన చెబుతున్నారు. మరి చేతల్లో ఎంత వరకు చేస్తారో చూద్దాం!

## కిమ్స్ రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న కిమ్స్ సిబ్బంది

నెల్లూరులోని కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రిలో ఈ నెల 13న ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో మెగా స్వచ్ఛంధ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిమ్స్ వైద్య నిపుణులు బి.మస్తాన్‌వలి, ప్రీతమ్, కృష్ణమోహన్, శివకుమార్, జగదీష్, శ్రీనివాసులు, దీప్తి, కుసుమ మరియు నర్సింగ్ స్టాఫ్, జూనియర్ వైద్యులు, పరిపాలనా, భద్రతా సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రక్తదానం చేసినవారికి ఆసుపత్రి ఇ.డి గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.వి.రెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జె.రంగారావు అభినందనలు తెలిపారు.

## 'అపస్మా' చీఫ్ స్పోక్స్ పర్సన్‌గా మైథిలి మనోహర్‌రెడ్డి



సత్కారాన్నందుకుంటున్న మనోహర్‌రెడ్డి, సుబ్బారెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపస్మా) చీఫ్ స్పోక్స్‌పర్సన్‌గా నెల్లూరులోని మైథిలి స్కూల్ కరెస్పాండెంట్ బి.మనోహర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 14న గుంటూరులోని అంజిరెడ్డి కళ్యాణమండపంలో జరిగిన అపస్మా రాష్ట్ర మహాసభలో నాయకులు ఆయన్ను ఎంపిక చేసుకుని అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన అసోసియేషన్ నాయకులకు, సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎం.వి.సుబ్బారెడ్డిని, జిల్లా ఉపాధ్యక్షునిగా శ్రీధర్‌ను ఈ మహాసభలో ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ చీఫ్‌విప్ జి.శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# ధర్మస్వరూపుడు.. శ్రీరామచంద్రుడు

### రామాయణ సప్తాహంలో వక్తలు



రామాయణం జీవన వేదమని, శ్రీరామచరితం లోకపూజితమని..మానవుడు ఎలా ఆదర్శవంతంగా జీవించాలో ఆచరించి చూపిన ధర్మస్వరూపుడు శ్రీరామచంద్రుడని వక్తలు పేర్కొన్నారు. గురుపూర్ణిమను పురస్కరించుకుని నెల్లూరు మైపాడురోడ్డులో ఉన్న నవలాకులతోటలోని శ్రీ సాయి ధర్మక్షేత్రమ్‌లో ఈనెల 8 నుంచి 15వ తేది వరకు పద్యసారస్వత పరిషత్ నెల్లూరుజిల్లాశాఖ వారి ఆధ్వర్యంలో 'శ్రీమద్రామాయణ సప్తాహం' జరిగింది. ప్రముఖ సారస్వతవేత్తలు కోట రాజశేఖర్, పోలవరపు లక్ష్మీనరసింహరావు, అగస్త్యరాజు సుబ్బారావు, డా.చీమకుర్తి వేంకటేశ్వరరావు, డా.సూరం శ్రీనివాసులు, సూరం చంద్రశేఖర్‌లు పాల్గొని రామాయణంలోని అనేక అంశాలను వివరించారు. మానవుల జీవనవిధానం ఎలా ధర్మబద్ధంగా ఉండాలో, గృహస్తు ధర్మాన్ని ఎంత పవిత్రంగా నిర్వర్తించాలో వేదాల్లో విశదీకరించి ఉన్నారని వారు పేర్కొన్నారు. దుష్టశిక్షణ-శిష్టరక్షణ కోసం అవతరించిన శ్రీరాముడు అమేయ పరాక్రమశాలి అయినప్పటికీ అత్యంత ధర్మబద్ధంగానే జీవించి లోకానికి మార్గదర్శకమయ్యారని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకుడు కుమార్ ఆధ్వర్యంలో వక్తలకు జ్ఞాపికలు బహూకరించి ఘనంగా సత్కరించారు. గురుపూర్ణిమ వేడుకల సందర్భంగా మందిరంలో కొలువై ఉన్న శ్రీ సాయినాధునికి ఆలయ నిర్వాహకులు ప్రతి నిత్యం ప్రత్యేకపూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

# ప్రజలే నా బలం... భద్రత

## సెక్యూరిటీని తిరస్కరించిన ప్రసన్న



శాసనసభ్యుడిగా వున్నప్పటికీ తనకు గన్‌మెన్‌లు అవసరం లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సెక్యూరిటీని తిరస్కరించారు. ప్రజల్లో తిరగడానికి సెక్యూరిటీ ఒక ప్రతిబంధకమని, తనకు శత్రువులెవరూ లేరని, ప్రజలే తన బలం, భద్రత అంటూ ఆయన సెక్యూరిటీని తీసుకోలేదు. గతంలో మాజీఎమ్మెల్యే స్వర్గీయ ఆనం వివేకానంద రెడ్డి, ప్రస్తుత నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు గన్‌మెన్‌లను పెట్టుకోలేదు. తాజాగా ప్రసన్న కూడా ఆ జాబితాలో చేరాడు.





## ఆదాలను కలిసిన ఎమ్మెల్యేలు



నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఈ నెల 13న నెల్లూరులోని ఆయన నివాసంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు, నెల్లూరు రూరల్ వైసిపి కార్యాలయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదాలను శాలువాతో సత్కరించారు. అలాగే కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా ఆదాలను మర్యాదపూర్వకంగా కలిశారు. కోవూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ఆదాలతో చర్చించారు.

**పలు సంఘాల నాయకులు...**

జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, జిల్లా రజక సంఘం నాయకులు రమణయ్య, రమేష్, సుబ్బారావులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కలిసి సత్కరించారు.

## శ్రీసిటి సిఎస్ఆర్ నిధులతో...

# హైస్కూల్ తరగతి గది నిర్మాణం



తరగతిగది ప్రారంభిస్తున్న ఐఎంపిపి మేనేజింగ్ డైరెక్టర్ తకేషి హిరాయి

కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్‌ప్లేట్ ప్రాసెసింగ్(ఐఎంపిపి) పరిశ్రమ యాజమాన్యం 10లక్షల రూపాయల వ్యయంతో తడ మండలంలోని ఇరుగుళం జడ్పీ హైస్కూల్‌లో నిర్మించిన నూతన తరగతి గదిని సోమవారం ఉదయం ఆ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ తకేషి హిరాయి ప్రారంభించారు. గదితో పాటు విద్యార్థులు కూర్చునే 15డెస్కులను వితరణగా తరగతిగదిలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఐఎంపిపి సంస్థ వితరణ పట్ల స్కూల్ ప్రధానోపాధ్యాయులు బాబూలాల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో గతంలో డానియల్ పరిశ్రమ ద్వారా ఓ తరగతి గది, సైన్స్ ల్యాబ్, టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరికొన్ని పరిశ్రమల ద్వారా ఇతర వసతులు స్కూలుకు సమకూరాయన్నారు. ఇక ప్రతియేటా శ్రీసిటీ ఫౌండేషన్ వారిచే నోటు పుస్తకాలు, విద్యాసామాగ్రి స్కూలు విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంపిపి డైరెక్టర్ నోబుయుకి ఓనిషి, సిఎఫ్ఓ హరిహరన్, శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ శివ శంకర్, శ్రీసిటీ ఎస్ఐ సుబ్బారెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యం

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌బికెఆర్ సిబ్బంది

పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని, ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదివి మంచి భవిష్యత్తును సొంతం చేసుకోవాలని ఎన్‌బీకెఆర్ ఐఎస్‌టీ కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 15న ఎన్‌బీకెఆర్ విద్యాసంస్థల 84వ జ్యోతిదినే పురస్కరించుకుని ఎన్ బీకెఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సమాధి వద్ద రామ్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాలకృష్ణారెడ్డి 1935లో వెలిగించిన విద్యాజ్యోతి నేడు దేశదేశాన ఎందరో జీవితాల్లో ఆరని జ్యోతిగా వెలుగుతుందన్నారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. కొడవలూరు దామోదర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దువ్వూరు అజిత్‌రెడ్డి, దేవారెడ్డి సురేంద్రరెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, చిట్టమూరు శ్రీనివాసులురెడ్డి, కస్తూర్‌రెడ్డి, యల్లంటి శివారెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# నష్టాల్లో ఉన్న సొసైటీని లాభాల్లోకి తీసుకొచ్చా

**- డిసిఎంఎస్ ఛైర్మెన్ సుమంత్‌రెడ్డి**

తాను ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు ఆరు లక్షల నష్టంలో ఉన్న మార్కెటింగ్ సొసైటీని ఇప్పుడు 36కోట్ల టర్నోవర్‌తో, 67లక్షల రూపాయల ఆదాయానికి తీసుకొచ్చామని జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి చెప్పారు. ఈ సొసైటీ పాలకవర్గం కాలపరిమితి పూర్తవుతున్న నేపథ్యంలో ఈనెల 12న నెల్లూరులోని డిసిఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఛైర్మెన్ సుమంత్‌రెడ్డి తమ పాలనలో సొసైటీలో జరిగిన అభివృద్ధిని గురించి వివరించారు. నెల్లూరులోని స్టోన్‌హౌస్ పేట కార్యాలయంలో లాభాపేక్ష లేకుండా రైతులకు ఎరువులను విక్రయించామని, సొసైటీకి ఇఎండి మినహాయింపుకు కృషిచేశామని, నవాబుపేటలో గోడౌన్ నిర్మాణానికి ఆర్‌కెవివై ద్వారా నూరుశాతం సబ్సిడీపై 50లక్షలు మంజూరుచేయించామని, ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అమలుచేశామన్నారు. ఇంతకాలం తమకు సహకరించిన సొసైటీ అధికారులకు, సిబ్బందికి ఆయన ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలిపారు. డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ సుధాభారతి మాట్లాడుతూ పాలకవర్గం తీసుకున్న సముచితమైన నిర్ణయాల వల్లనే సొసైటీ లాభాల బాటలో పయనించిందన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఛైర్మెన్ సుమంత్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

# రాజకీయ కక్షలుంటే నాపై తీర్చుకోండి

**సోమిరెడ్డి**



సోమిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడులను సన్మానిస్తున్న కమ్మజన సంఘం నాయకులు

రాజకీయంగా కక్ష్యలుంటే నాపై తీర్చుకోండి కాని, పేదప్రజలకు ఉపయోగపడే పథకాలను ఆపొద్దని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 16వతేదీ ఆయన పొదలకూరులో జరుగుతున్న హనుమ జ్జయంతి ఉత్సవాలలో భాగంగా కమ్మజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో పొదలకూరులో ఎన్టీఆర్ సుజలస్రవంతి మెగా వాటర్ ప్లాంట్, అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశామని, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే వాటిని నిలిపేయడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా సర్వేపల్లి నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి దాపురించింద న్నారు. కలెక్టర్‌ను కలిసి వీటి సేవలను పునరుద్ధరించాలని కోరుతామన్నారు. ఈ కార్యక్ర మంలో ఆయనతో పాటు మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు కూడా పాల్గొన్నారు.

## రూరల్ తహశీల్దార్‌గా

# నిర్మలానందబాబా

నెల్లూరు రూరల్ మండలం నూతన తహశీల్దార్‌గా ఎ.నిర్మలానందబాబాను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికలు ముగిశాక కొత్త ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఆయన గుంటూరు నుండి నెల్లూరు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీకాంత్ కేధార్‌నాథ్‌ను గుంటూరుకు బదిలీ చేశారు.

# రూరల్ అభివృద్ధికి కలిసి నడుద్దాం..!

## - నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి

నెల్లూరు రూరల్ మండల అభివృద్ధికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ కార్యాలయం ఇన్‌చార్జ్ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిల సమన్వయంతో ప్రధాన సమస్యల పరిష్కారానికి పాటుపడతామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు.

ఈనెల 14న నెల్లూరు రూరల్ మండలం కొమ్మరపూడి, ములుమూడి గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైయస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్ రెడ్డి, తాను ఎల్లవేళలా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి అండగా వుంటామన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. తన ఎంపీ నిధులతో రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి అనిల్ కుమార్‌యాదవ్‌తో మాట్లాడి డిసెంబర్ నెలలోగా కొమ్మరపూడికి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తీసుకువస్తామన్నారు. నెల్లూరు గ్రామీణ మండలంలోని 17 గ్రామాల్లో ప్రజలకు శుద్ధ జలాన్ని అందించేందుకు రూ. 5లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రజలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులను సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా ఎన్నుకోవాలన్నారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి తమ సహకారం ఎల్లవేళలా అందిస్తామన్నారు. ముందుగా కొమ్మరపూడిలో రూ. 53 లక్షలతో చేపడుతున్న తారురోడ్డు మరమ్మత్తు పనులకు ఆదాల, కోటంరెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. ములుమూడిలో రూ. 1.50 లక్షలతో నిర్మించిన రచ్చబండను, రూ. 5 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైకాపా నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, వైవీ రామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి

---

# గూడూరు డివిజన్ వార్తలు

## చవటపాళెం విద్యార్థుల..

# ఇబ్బందులు తీర్చండి



సబ్ కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపిటిఎఫ్ నాయకులు

గూడూరు మండలంలోని దివిపాలెంలో ఉన్న చవటపాళెం ప్రాథమిక పాఠశాల నిర్మాణం పూర్తయినా ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఏపిటిఎఫ్ నాయకులు సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ పాఠశాలలో 150మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ భవన సదుపాయం లేకపోవడంతో ఒకే గదిలో పాఠాలు చెప్పాల్సి వస్తోందని వారు సబ్‌కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏపిటిఎఫ్ నాయకులు జయపాల్‌రెడ్డి, నీరుకట్టు మోహన్‌దాస్, శ్రీను, చిరంజీవి పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన.. లిటిల్‌ఏంజెల్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

న్యూ ఏపి తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో గూడూరులోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటి పతకాలు గెలుచుకున్నారు. నెల్లూరు మాగుంట లేఅవుట్ లోని రెయిన్‌బో పాఠశాలలో ఈ నెల 15న జరిగిన ఈ పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో(20–22 కిలోల) యు.దీక్షామీనా రజతపతకాన్ని సాధించగా, 22–24 కిలోల విభాగంలో సత్యాంజలిరెడ్డి రజత పతకాన్ని, 24–26 కిలోల విభాగంలో బి.శివ జాహ్నవి కాంశ్యపతకాన్ని, 26–29 కిలోల విభాగంలో సిహెచ్ ఝాన్సీలక్ష్మి కాంశ్య పతకాన్ని సాధించారు. ప్రత్యేకించి 41–43 కిలోల విభాగంలో జె.తేజస్విని బంగారు పతకాన్ని సాధించి అందరి అభినందనలు అందుకుంది. ఈ సందర్భంగా లిటిల్‌ఏంజెల్స్ పాఠశాల కరెస్పాండెంట్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, వైస్‌ఛైర్మెన్ బి.శ్రీకాంత్‌రెడ్డి, అకడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీమతి బి.సుధేష్ణ పాల్గొని విద్యార్థులందరినీ అభినందించారు. అనంతరం కోచ్ యు.పవన్‌కుమార్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

# తల్లిదండ్రులను అనాధలను చేయొద్దు

## - ఎస్ఐ సైదులు

నానాటికీ సమాజంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతూ ఉందని, తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్చి తమ బిడ్డలు తల్లిదండ్రులను అనాధలను చేయడం దారుణమని ఎస్ఐ సైదులు అన్నారు. గూడూరులోని సాయిరాం ఛారిటీస్ వృద్ధాశ్రమంలో జేవివి ఆధ్వర్యంలో ఈనెల14న పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులకు, వృద్ధులకు, దివ్యాంగులకు అందరూ తమ చేయూత నందించాలన్నారు. ఈ నేపథ్యంలో జేవీవీ సభ్యులు మానవీయమైన ఇలాంటి కార్యక్రమాలను చేపడుతుండడం ఎంతైనా అభినందనీయమన్నారు. తొలుత, చిల్లకూరు ప్రాంతానికి చెందిన యాటగిరి రామయ్య అనే దివ్యాంగునికి ట్రైసైకిల్‌ను అందజేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. జేవివి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్‌తో పాటు పురుషోత్తమరావు, చెంచునారాయణ, అశోక్, రాజేష్, చంద్రారెడ్డి, కుశాల్, వెంకటేశ్వర్లు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.




దివ్యాంగునికి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న ఎస్ఐ సైదులు, రాజేంద్రప్రసాద్ తదితరులు

## మునిసిపల్ కమిషనర్‌గా ఓబులేసు



గూడూరు పురపాలకసంఘం కమిషనర్‌గా వై. ఓబులేసును పురపాలక సంఘం ఉన్నతాధికారులు తాజాగా నియమించారు. ఆ ఆదేశాల మేరకు ఆయన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు కమిషనర్‌గా గూడూరులో ఓబులేసు తన విధులు నిర్వహించారు. ఇప్పటివరకు గూడూరు కమిషనర్‌గా ఉన్న పి.రవిని పుట్టపర్తి కమిషనర్‌గా బదిలీ చేశారు.

# నేత్రపర్వంగా గురుపౌర్ణమి వేడుకలు



ఊంజల్‌సేవలో పాల్గొన్న శ్రీకంటిరామ్మోహన్‌రావు-రాజ్యలక్ష్మి, డాక్టర్ సి.రోహిణి తదితరులు

ఈనెల 16న గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని గూడూరు సాయినగర్‌లోని శ్రీ సాయిబాబా మందిరంలో నేత్రపర్వంగా వేడుకలు జరిగాయి. స్వామివారిని శోభాయమానంగా అలంకరించి పల్లకీసేవ, ఊంజల్‌సేవ నిర్వహించారు. శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మితో పాటు వారి కుటుంబసభ్యులు ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా వ్యవహరించారు. డాక్టర్ సి.రోహిణి, మాలతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గూడూరులోని అనేక ఆలయాల్లో కొలువైవున్న దేవతా మూర్తులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

# పాఠశాలకు వాటర్‌కూలర్ వితరణ



పాఠశాలకు వాటర్ కూలర్‌ను అందజేస్తున్న బత్తిని విజయకుమార్

గూడూరులోని ఎస్ఎంజి ప్రాథమిక పాఠశాలకు సోమవారం అరుణ్ జ్యుయలర్స్ అధినేత ధార్మిచంద్ దాతృత్వంతో వాటర్‌కూలర్‌ను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు బత్తిని విజయకుమార్, మనోహర్, అల్లూరు సుధాకర్, లయన్ కడివేటి జాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వల్లే ఇంగ్లాండ్‌కు వరల్డ్‌కప్

చిత్తూరుజిల్లాలోని కుప్పం. హైటెక్ రత్న చంద్రబాబునాయుడు పార్టీ కార్యాలయంలో కూర్చునివున్నారు. అప్పుడే కొందరు మహిళలు వచ్చారు. అందరూ నల్లగా నుదుటన పెద్దపెద్ద బొట్లు పెట్టుకుని వున్నారు. వాళ్లంతా రావడంతోటే చంద్రబాబును పట్టుకొని పూపేస్తూ రోదిస్తూ తమిళంలో... అయ్యో నాయనా, నీకెంత కష్టమొచ్చింది నాయనా.. ఆ దేవుడు నీకు అన్యాయం చేశాడయ్యా... ఆ తీసుకుపోయేదేదో మమ్మల్నన్నా తీసుకుపోకూడదా దేవుడా... అని గుండెలు బాదుకుంటున్నారు. కుప్పంలో తమిళియన్స్ ఎక్కువగా వుండడం, చంద్రబాబుకు కూడా తమిళం వచ్చి వుండడంతో వాళ్ల భాష అర్థమైంది. అయితే వాళ్లు ఎందుకోసం ఏడుస్తున్నారన్నది మాత్రం అర్థం కాక... పక్కనే వున్న టిడిపి నాయకుడు పులివర్తి నానిని పిలిచి... వాళ్లంతా ఏంటి ఎవరో పోయినట్లు ఏడుస్తున్నారు... అసలు మన కాన్సెప్టే వేరు... మహిళలు ఎవరొచ్చినా నన్ను పట్టుకుని 'నువ్వు ఓడిపోవడం ఏంటయ్యా' అంటూ పెద్ద పెట్టున ఏడవాలి. అలా రోజుకొక జిల్లావాళ్ళు రావాలి. ఇప్పటిదాకా అన్ని జిల్లాల మహిళలు కరెక్ట్‌గానే యాక్షన్ చేశారు. కాని వీళ్లేంటి ఓవర్ యాక్షన్ చేస్తున్నారు. అసలు సబ్జెక్ట్‌తో పొంతన లేని ఏడుపులు ఏడుస్తున్నారు అని అడిగాడు. పులివర్తి నాని వుండి... వీళ్ళంతా అరవ మహిళలు సార్.... పెయిడ్ ఆర్టిస్ట్స్... చెన్నై నుండి తీసుకొచ్చాం. అరవ సినిమాలలో ఏడుపుగొట్టు సీన్‌లకు వీళ్ళను పిలుస్తుంటారు. మృతదేహం వద్ద ఏడ్చే కేకలతో వీళ్ళు బ్రహ్మాండంగా నటిస్తుంటారు. వీళ్లయితే సీన్‌లు రక్తికడతాయని చెప్పి ఒక్కొక్కరికి 5వేల రూపాయల కాంట్రాక్ట్ లెక్కన మాట్లాడి పిలిపించాను. చంద్రబాబు గారిని ఓదార్చడమే మీ పని అని చెప్పాను. "మీరు ఓడిపోవడం ఏంటయ్యా" అనే కాన్సెప్ట్‌ను నేను వాళ్ళకు వివరించలేదు. కేవలం చంద్రబాబును ఓదార్చాలనేసరికి వాళ్ళు సహజసిద్ధంగా సినిమాలలో చేసిన యాక్షనే మీ వద్దా చేశారు, పొరపాటయ్యింది అని చెప్పాడు. సరేలే ముందు వాళ్ళ పేమెంట్ ఇచ్చి పంపు, ఇంకోసారి ఇలాంటివి రిపీట్ కాకుండా చూసుకో అని చెప్పి కార్యాలయం లోపలకు వచ్చేశాడు. అప్పటికే లోపల టిడిపి నాయకులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నారా లోకేష్, అచ్చెయ్యనాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దేవినేని ఉమమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావులు వున్నారు. చంద్రబాబు వారితో... "నువ్వు ఓడిపోవడం ఏంటయ్యా" అనే మన ధారావాహిక ఎపిసోడ్‌లకు ప్రజల్లో ఎలాంటి స్పందన వుందని వారిని అడిగాడు. అందుకు సోమిరెడ్డి... స్పందన చాలా బాగుంది సార్, ముఖ్యంగా మహిళలైతే టీవీలలో వచ్చే 'మొగుడి కేకలు', 'కొడితే మొగుడినే కొట్టాలి', 'పాత అత్త - కొత్త కోడలు', 'రోత మొగుడు' వంటి సీరియల్స్ కంటే కూడా 'మీరు ఓడిపోవడం ఏంటయ్యా' అనే మన ఎపిసోడ్‌లనే ఎక్కువగా చూస్తున్నార్సార్ అని చెప్పాడు. వెంటనే లోకేష్ అందుకుని... నాన్నగారు, ఇప్పటి వరకు 'నువ్వు ఓడిపోవడం ఏంటయ్యా' అనేది తెలుగు మహిళలతోనే తీసాం... మీరు జాతీయ స్థాయి నాయకులు... మీరు ఓడిపోయినందుకు అన్ని రాష్ట్రాల ప్రజలు కూడా బాధపడుతున్నారనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అందుకని ఒకరోజు బెంగాల్ మహిళలు, ఇంకోరోజు మహారాష్ట్ర మహిళలు... ఇలా రోజుకో రాష్ట్రం మహిళలు వచ్చి మిమ్మల్ని ఓదార్చే విధంగా ప్లాన్ చేస్తున్నాను. ఈ దెబ్బతో మీరు దేశ వ్యాప్తంగా ఫోకస్ అవుతారు అని చెప్పాడు. అందుకు చంద్రబాబు... ఏ రాష్ట్రం మహిళలైనా పిలవండి... ఇబ్బంది లేదు. ఆ అరవ వాళ్లను మాత్రం పిలవొద్దు. వాళ్ల ఏడుపు చూస్తుంటే ఓడిపోయినందుకు ఏడుస్తున్నట్లు లేదు... పైకి పోయినందుకు ఏడుస్తున్నట్లుంది అని అన్నాడు.

అంతలో పత్తిపాటి పుల్లారావు ఏదో గుర్తొచ్చినట్లు టీవీ ఆన్ చేశాడు. ఏం అంత అర్జంట్‌గా టీవీ ఆన్ చేశావ్ అని దేవినేని ఉమ అడిగాడు. ఈరోజు వరల్డ్ కప్ ఫైనల్ అన్నా... చూద్దామని అని పత్తిపాటి చెప్పాడు. చంద్రబాబు వుండి... కప్ ఇంగ్లాండ్‌దే కదా... చూసినా చూడకున్నా జరిగేది అదే అని అన్నాడు. అంత గ్యారంటీగా ఎలా చెప్పగలరని సోమిరెడ్డి అడిగాడు. నువ్వే చూడు అని చంద్రబాబు ముక్తసరిగా చెప్పాడు. టీవీలో స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానెల్‌లో ఫైనల్ మ్యాచ్. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 241 పరుగులు చేయడం, ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ కూడా 241 పరుగులే చేయడం, ఆ తర్వాత సూపర్ ఓవర్‌లోనూ ఇరు జట్లు చెరో 15 పరుగులు చేయడం, చివరకు అధిక బౌండరీల ద్వారా ప్రపంచ విజేతగా ఇంగ్లాండ్‌ను నిర్ణయించడం జరిగాయి. చంద్రబాబు చెప్పినట్లే ఇంగ్లాండ్ గెలిచేసరికి సోమిరెడ్డి ఆశ్చర్యంగా... ప్రపంచ క్రికెట్ కప్‌లో ఎవరు గెలుస్తారో ముందే చెప్పిన వాడివి, నిన్నటి ఎన్నికల్లో మనం ఓడిపోతున్నామని ముందే ఎందుకు చెప్పలేదు సార్, ఆ మాట ముందే చెప్పుంటే మన పార్టీ అభ్యర్థులందరికీ డబ్బులు మిగిలివుండేవి కదా అని వాపోయాడు. నాకు తెలుసు కాబట్టే కదా నేను డబ్బు ఖర్చు పెట్టలేదు అని చంద్రబాబు చెప్పాడు. ఆ మాటతో సోమిరెడ్డి నోరెళ్లబెట్టాడు.

ఇక టీవీ స్క్రీన్‌పై మ్యాచ్ ముగిసి కప్ ఇస్తున్నారు. మీ విజయానికి కారణమేంటని ఇంగ్లాండ్ కెప్టెన్ మోర్గాన్‌ను క్రికెట్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సచిన్ టెండూల్కర్ అడిగాడు. అందరు కూడా తమ కోచ్ కారణమనో, ఆటగాళ్ల సమిష్టి కృషి అనో, తమ దేశ ప్రజల ఆశీస్సులనో చెప్తాడనుకున్నారు. కాని, మోర్గాన్ మాత్రం... ఆంధ్రా మాజీసీఎం చంద్రబాబునాయుడు వల్లే మేం ఈరోజు ప్రపంచ కప్ గెలిచాం అని చెప్పాడు. ఆ మాటకు అక్కడున్న వాళ్ళే కాకుండా టీవీలు చూస్తున్న వాళ్ళు కూడా షాకయ్యారు. సచిన్ కొద్దిసేపటికి తేరుకుని... మీరు గెలవడానికి, చంద్రబాబుకు ఏమిటి సంబంధం అని అడిగాడు. దానికి మోర్గాన్... ఒలంపిక్స్‌లో పతకం తెచ్చిన సింధుకు ఆయనే ఆట నేర్పాడు... మైక్‌టైసన్‌కు బాక్సింగ్ ఆయనే నేర్పాడు. సెల్‌ఫోన్‌లు కనిపెట్టింది, ప్రపంచానికి టెక్నాలజీని పరిచయం చేసింది కూడా ఆయనే. ఇన్ని చేసినోడు, వరల్డ్‌కప్‌లో మా దేశాన్ని గెలిపించలేడా? అనే ఆలోచన నాకొచ్చింది. దీనిపై ఫైనల్ మ్యాచ్‌కు ముందు ఆయనను సంప్రదించాను. ఆయన ఇచ్చిన సలహా ఒక్కటే. ఒక్కోసారి గెలవడానికి రహదారులకంటే అడ్డదారులే ఎక్కువగా ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. రెండు జట్లు సమానంగా పరుగులు చేస్తాయి... సూపర్ ఓవర్‌లోనూ సమంగా పరుగులొస్తాయి అనుకోండి... అప్పుడు విజేతను ఎలా నిర్ణయిస్తారు అని ఆయన అడిగాడు. ఎక్కువ బౌండరీల ద్వారా నిర్ణయిస్తారని నేను చెప్పాను. వెంటనే ఆయన... మీ స్కోర్‌లో ఎక్కువ బౌండరీలు వుండేటట్లు చూసుకోండి అని సలహా ఇచ్చాడు. ఆయన సలహా ప్రకారమే స్కోర్‌ను ఛేదించే ప్రయత్నంతో పాటు న్యూజిలాండ్ కంటే ఎక్కువ బౌండరీలు కొట్టడానికి ప్రయత్నించాం. అదృష్టం కొద్ది ఆ బౌండరీలే మమ్మల్ని ఈరోజు ప్రపంచ విజేతగా నిలిపాయి. థాంక్స్ టు చంద్రబాబు అని ముగించాడు.

టీవీలలో ఆ సీన్ చూసిన సోమిరెడ్డి, పత్తిపాటి, దేవినేనిలు చంద్రబాబు వైపు చూస్తూ మనసులో... వరల్డ్ కప్ క్రికెట్‌లో ఇంగ్లాండ్‌ను గెలిపించిన నువ్వు... ఏపి ఎన్నికల్లో ఓడిపోవడమేంటయ్యా అని మనసుల్లో అనుకున్నారు.

# అంగరంగవైభవంగా.. ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు

- ఏకబిగిన 21 రోజులపాటు వేడుకలు
- వేలసంఖ్యలో తరలివచ్చిన భక్తులు

నెల్లూరు మూలాపేటలోని ప్రసిద్ధ దేవాలయమైన శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో గతనెల 19వతేది నుంచి ఈనెల 9వతేది వరకు 21రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరిగాయి. మహాభారత ఘట్టాలకు ప్రతీకగా ప్రతి మూడేళ్ళ కొకసారి జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు భక్తజనం వేలాదిగా తరలివచ్చారు. ఎంతోమంది ప్రముఖులు ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. అర్చకులు నిత్యం ప్రత్యేకమైన అలంకారాలతో స్వామివార్లను శోభాయమానం చేయగా, ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తలమండలి వారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ద్రౌపదీదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

ధర్మరాజులస్వామి గుళ్లో బ్రహ్మోత్సవాలంటే చాలు.. జనం తండోపతండాలుగా తరలివస్తారు. శ్రీకృష్ణుడు, పాండవులు, ద్రౌపదీదేవి కొలువై వున్న ఆలయం కావడంతో ఈ గుళ్లో ఉత్సవాలను మహాభారత ఘట్టాలతో నిర్వహించడం ఇక్కడి విశిష్టత. ఆరోగ్యదాయినిగా, సంతాన ప్రదాయినిగా కొలుస్తూ ద్రౌపదీదేవి అమ్మవారికి పూజలు చేయడం ఇక్కడి ప్రత్యేకత. గత నెల 19వ తేది రాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. మూలవర్లకు, ఉప ఆలయాల్లోని శిలా మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నవగ్రహారాధన, మృత్సంగ్రహణం, హోమాలు నిర్వహించారు. 20వ తేది ధ్వజారోహణం జరిగింది. చీఫ్ ఫెస్టివల్ అధికారి కృష్ణ చైతన్య, ఆలయ ఇ.ఓ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. రాత్రికి తీర్థవాది ఉత్సవం, చప్పర ఉత్సవం నిర్వహించారు.

### ఒక్కోరోజు ఒక్కో విశిష్టమైన అలంకారం...

ఈ బ్రహ్మోత్సవాల్లో ఒక్కోరోజు ఒక్కో విశిష్టమైన అలంకారంతో వేడుకలు అందరినీ అలరించాయి. వీటిలో భాగంగా 21వ రాత్రి పాండవజననం అలంకారం, 22వ తేది రాత్రి అక్షరాభ్యాసం, విలువిద్య అలంకారం, 23వ తేది రాత్రి లక్క గృహ దహనం, 24న హిడింబాసుర వధ అలంకారం, 25న ద్రౌపదీదేవి అలంకారం, 26న సుభద్రాదేవి కల్యాణోత్సవం, 27న రాజసూయ యాగం, 28న ద్రౌపదీదేవి మాన సంరక్షణ అలంకారం, 29న తపస్సుమాను ఉత్సవం అత్యంత వైభవంగా జరిగాయి. 30వ తేది విరాటపర్వం, జూలై 1వ తేది రాత్రి మల్లయుద్ధం, 2న కీచక వధ, 3న ఉత్తర గోగ్రహణం, 4న శ్రీకృష్ణరాయబారం, 5న అలుగు నిలుపుట (బలవంతుని వధ, భద్రకాళి పూజ), 6న దుర్యోధన, దుశ్శాసన వధ, 7న ఎంతో విశిష్టమైన అగ్నిగుండం ప్రవేశం, 8న వసంతోత్సవం, 9వ తేది మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదానం. ఆదేరోజు రాత్రి యుధిష్ఠిర పట్టాభిషేకం అలంకారాలతో ఈ బ్రహ్మోత్సవాలు వేడుకగా ముగిశాయి.



అగ్నిగుండంపై నడుస్తున్న భక్తులు

### భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం..

ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 7న జరిగిన అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని అగ్నిగుండ ప్రవేశ మహాద్వారాన్ని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ఆలయానికి విచ్చేసి స్వామివార్లను, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండం ప్రవేశం కార్యక్రమాన్ని తిలకించారు. దీక్షలు చేపట్టిన పలువురు భక్తులు భగభగలాడే ఆ అగ్నిగుండంలో నడుస్తూ వెళ్ళి తమ భక్తిని చాటుకున్నారు. ద్రౌపదీదేవి అమ్మవారు అగ్నిపునీత అని, పవిత్రతకు చిహ్నమని చాటిచెప్పే ఈ అగ్నిప్రవేశ కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ శివపురం సురేష్, కమిటీ సభ్యులు మిట్టా ధనుంజయ, పట్నం విజయకుమార్, దొంతల రఘురామయ్య, దువ్వూరు శైలేంద్ర పర్యవేక్షించారు.

### మహాభారత ఘట్టాలను కళ్ళముందు నిలిపిన బ్రహ్మోత్సవాలు

ధర్మరాజుల గుళ్ళో బ్రహ్మోత్సవాలంటే మహాభారతాన్ని కళ్ళముందు చూసినట్లే. భారతంలో పాండవ జననం నుంచి ధర్మరాజ పట్టాభిషేకం వరకు అన్ని ఘట్టాలను తలపింపజేస్తూ ఇక్కడ బ్రహ్మోత్సవాలు జరగడం ఎంతైనా విశేషం. ముఖ్యంగా తపస్సుమాను, ఉత్తర గోగ్రహణం, అగ్నిగుండ ప్రవేశం వంటి ఉత్సవాలు మరెంతో విశిష్టమైనవి. భక్తులు ఈ బ్రహ్మోత్సవాల్లో 5వ రోజున, 10వ రోజున ఉపవాస దీక్షలతో ద్రౌపదీదేవి అమ్మవారిని ప్రార్థించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయి కూడా. లోకకల్యాణార్థం ద్రౌపదీదేవి అమ్మవారు అగ్నిగుండం నుంచి జన్మించి పాండవులకు ధర్మపత్నిగా, శ్రీకృష్ణునికి సోదరిగా పురాణప్రసిద్ధి చెందిన విషయం అందరికీ తెలిసిందే. అందువల్ల అగ్నికుల జులకు కులదేవతగా ప్రసిద్ధి చెందిన ద్రౌపదీదేవి అమ్మవారికి ఎంతోకాలం నుంచి ఈ ఆలయంలో ప్రత్యేకపూజలు జరుగుతున్నాయి. ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తల మండలి వారు, అధికారులు అందరూ సమన్వయంగా, ఎక్కడా లేని విధంగా 21 రోజుల పాటు ఏకబిగిన ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం ఎంతైనా విశేషం.

## భక్తిశ్రద్ధలతో..

# గురుపౌర్ణమి మహోత్సవం

గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా ఈనెల 16న జిల్లాలోని సాయి మందిరాలు భక్తులతో కిక్కిరిసాయి. బాబా మందిరాలకు వేకువజామునుంచే భక్తులు తరలివచ్చారు. ఓం సాయి.. శ్రీసాయి.. జయజయ సాయి.. బోలో సాయినాథ్ మహరాజ్‌కి జై నామస్మరణలతో బాబా మందిరాలు మార్మోగాయి. సాయినాథుడికి అభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు తదితర విశేష పూజలను భక్తులు నిర్వహించారు. చంద్రగ్రహణం వల్ల మధ్యాహ్నం 3 గంటలకు మందిరాలను మూసివేశారు.





### ట్రంకురోడ్డు బాబా మందిరంలో...

నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీనగర్ లోని షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా మహిళలు లలితా సహస్రనామ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా కృష్ణారెడ్డి దంపతులు వ్యవహరించారు. బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, షిరిడి హారతులు నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు మన్నెం అమరనాథరెడ్డి, కార్యవర్గ సభ్యులు కొల్లి శ్యాంసుందరరెడ్డి, పైడిపాటి సుధాకర్ రావు, దువ్వూరు జయమ్మ, బి. మోహన్‌రావులు పర్యవేక్షించారు.

### శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో..


నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో సాయిదర్బార్ ట్రస్ట్, సత్సంగ్ సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వ హించారు. ప్రత్యేక పుష్పాలంకరణలో సాయినాథుడు దర్శన మిచ్చారు. మూడు పూటల సాయినాథునికి షిరిడి హారతులు ఇచ్చారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఓం సాయి.. శ్రీ సాయి... జయజయసాయి.. అఖండ సాయినామ సంకీర్తన, దాదాపు 5వేలమంది భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిదర్బార్ అద్దాల మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన సాయి మాట్లాడుతూ అన్న ప్రసాద వితరణకు ఉభయకర్తలుగా యాత్రాసి కోటయ్య కుటుంబసభ్యులు, శింగంశెట్టి హనుమంతరావు, పంగులూరు రమేష్ బాబు, విశేష పుష్పాలంకరణకు ఉభయకర్తలుగా ఉద్దండి కోటయ్య, శైలజ దంపతులు వ్యవహరించారన్నారు.

### నవాబుపేట బాబా మందిరంలో...

నవాబుపేట రామకృష్ణానగర్, షిరిడి సాయినగర్‌లోని సాయి బాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా బాబా వారికి షిరిడి హారతులు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషే కాలు, పూలంగి సేవ, గోపూజ తదితర విశేష పూజలు నిర్వ హించారు. ఉభయకర్తలుగా ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నాగిశెట్టి బాబూరావు, స్వర్ణలత దంపతులు వ్యవహరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ గావించారు. ఉభయకర్తలుగా మందిర గౌరవాధ్యక్షులు యనమల క్రిష్ణయ్య, సుగుణమ్మ దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమ ఉభయకర్తలుగా నాగవరపు శ్రావణ్‌కుమార్, భజన కార్యక్రమ ఉభయకర్తలుగా తోట వెంకటేశ్వరరావు, అన్నపూర్ణేశ్వరి దంపతులు, ప్రసాదాల ఉభయకర్తలుగా మేకల రమేష్‌బాబు, మాధవీలత, పెంచల నరసింహం, రత్నకుమారి వ్యవహరించారు.

మద్రాస్ బస్టాండ్, ఏసీ మార్కెట్ వద్ద నున్న లక్ష్మీ గణపతి శివపార్వతీ సమేత సాయిబాబా మందిరంలో సాయినాథునికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. నిప్పో సెంటర్ వద్ద నున్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఉదయం పంచసూక్త పూర్వక పంచామృతాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సంగీత విభావరి తదితర కార్యక్రమాలను నిర్వ హించారు. చిల్డ్రన్స్ పార్కు వద్ద నున్న సాయిసదన్ లో బాబావారికి విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని లక్ష్మీ నగర్, జాకీర్ హుస్సేన్ నగర్, సంజయ్‌గాంధీనగర్, బి.వి.నగర్, ఏపిహెచ్‌బి కాలని తదితర ప్రాంతాల్లోని బాబా మందిరాల్లో గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథునికి విశేషపూజలు నిర్వహించారు.

# సభలో నవ్వుల్... పువ్వుల్...



## శ్రీధర్ సీటుపై ఆసక్తికర చర్చ

రాష్ట్ర శాసనసభ సమావేశాలలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూర్చున్న సీటుపై ఆసక్తికర చర్చ జరిగి సభలో నవ్వులు పూయించింది. శ్రీధర్‌రెడ్డి అసెంబ్లీలో తనకు కేటాయించిన స్థానంలో కాకుండా ప్రతిపక్ష తెలుగుదేశం సభ్యులకు దగ్గరగా ఖాళీగా వున్న స్థానంలో కూర్చున్నాడు. దీనిపై ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అచ్చెన్నాయుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలు అభ్యంతరం చెప్పారు. స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆయన స్థానంలోకి వెళ్లి కూర్చోవాల్సిందిగా ఆదేశించారు.

ఈ సమయంలో సీఎం జగన్ లేచి ఆ సీటు వివాదంపై చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు కురిపించాయి. అధ్యక్షా... శ్రీధర్‌రెడ్డి ఐదేళ్ళు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా వున్నప్పుడు అక్కడే కూర్చున్నాడు. అధికారంలోకి వచ్చాక కూడా అక్కడే కూర్చుంటున్నాడు. ఆ సీటుపై ఆయనకు వ్యామోహం తీరినట్లు లేదు. శ్రీధర్ గుడ్‌బాయ్... మీరు చెప్పగానే అక్కడి నుండి వెళ్లిపోయాడు. కాని, ఒక సీటు గురించి చంద్రబాబు ఇంత రాద్ధాంతం చేయడమే ఏమీ బాగాలేదంటూ చురకలంటించి సభను నవ్వుల్లో ముంచెత్తారు.

## జిల్లాలో

# కొత్త డిఎస్పీలు

జిల్లాలోని ఐదు పోలీస్ సబ్ డివిజన్లకు ఎట్టకేలకు డిఎస్పీల నియామకం జరిగింది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదట గత ప్రభుత్వంలో నియమించిన నెల్లూరు నగరం, గూడూరు, ఆత్మకూరు డిఎస్పీలను బదిలీ చేశారు. 16వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా భారీఎత్తున డిఎస్పీల బదిలీలు జరిగాయి. అనంతపురం పిటిసిలో పని చేస్తున్న జె.శ్రీనివాసరెడ్డిని నెల్లూరు నగర డిఎస్పీగా నియమించారు. నెల్లూరురూరల్ డిఎస్పీగా వున్న కె.వి.రాఘవరెడ్డిని డిజిపి ఆఫీసుకు అటాచ్ చేసి ఆయన స్థానంలోకి స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా పని చేస్తున్న కోటారెడ్డిని నియమించారు. కోటారెడ్డి గతంలో ఎస్‌ఐగాను, సిఐగాను జిల్లాలో పలుచోట్ల పని చేయడం తెలిసిందే! సిఐడిలో వున్న ఎం. భాస్కర్‌రావును ఆత్మకూరు డిఎస్పీ గాను, ఆర్‌ఎస్‌ఎఎస్‌టిఎఫ్‌లో వున్న బి.భవాని శ్రీహర్షను గూడూరు డిఎస్పీగాను నియ మించారు. అలాగే నెల్లూరు సిసిఎస్‌లో వున్న నరసప్పను తిరుపతి అర్బన్ డిఎస్పీగా బదిలీ చేశారు.

## ● హైదరాబాద్‌లో

# మన నెల్లూరీయుడి మరో సంస్థ

### ఐటి రంగంలో అత్యద్భుత శిక్షణనందించే 'మెగ్నీషియా'



ప్రపంచవ్యాప్తంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేటి కాలంలో ఇంకా మన రాష్ట్రంలోని విద్యార్థులు వెనుకబడిపోతుండడాన్ని గుర్తించిన ప్రముఖ సాంకేతిక నిపుణులు, ఐటి శిక్షణారంగంలో బాగా అనుభవం ఉన్న ముమ్మారెడ్డి గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరావుల సారథ్యంలో హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో 'మెగ్నీషియా' సంస్థ ప్రారంభమైంది. గోపాలరెడ్డిది నెల్లూరుజిల్లా కురుగొండ. అమీర్‌పేట ప్రాంతంలో "మైండ్ క్యూ" సిస్టమ్స్ సంస్థ ద్వారా టెస్టింగ్‌టూల్స్‌లో శిక్షణ ఇవ్వడంలో తమ సంస్థను అగ్రగామిగా నిలిపిన గోపాల్‌రెడ్డి ఇప్పుడు "మెగ్నీషియా"ని ప్రారంభించారు. ఐటి రంగంలో మన విద్యార్థులు ముందుండాలని, అమీర్‌పేట నుంచి అమెరికా దాకా ఐటి ఇండస్ట్రీని అభివృద్ధి చేయాలన్న వారి ఆలోచనలతో ఈ శిక్షణాసంస్థను ప్రారంభించారు. అత్యంత అధునాతనమైన రీతిలో హైదరాబాద్‌లోని కొత్తగూడ క్రాస్‌రోడ్స్ వద్ద పారాడిమ్ ఎస్ఎస్ఎస్ స్క్వేర్‌లో ఈ సంస్థ ఇటీవల వైభవంగా ప్రారంభోత్సవం జరుపుకుంది.

### సాంకేతిక నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు - అజేయకల్లం

తన చేతులమీదుగా ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రధాన సలహాదారు అజేయకల్లం మాట్లాడుతూ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగులు దిద్దుకోవాలని, అప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. మనదేశంలో ఏటా 16 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు తయారవుతుంటే, అందులో మన రాష్ట్రం వారు కనీసం 2లక్షల మందిదాకా ఉన్నారని. అయితే వీరిలో కేవలం 20 శాతం మంది మాత్రమే ఉద్యోగాలకు సిద్ధమవుతున్నారని, మిగిలినవారిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి కావాల్సిన నైపుణ్యం లేకపోవడం వల్ల వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల్లో ఇంజనీరింగ్ సబ్జెక్ట్ నేర్చుకున్నంతమాత్రాన సరిపోదని, అందుకు తగ్గట్టుగా సాంకేతిక నైపుణ్యాన్ని కూడా విద్యార్థులు బాగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మెగ్నీషియా ఐటి శిక్షణా కేంద్రంలో 3 నుంచి 6నెలల వరకు ఐటి కమ్యూనికేషన్ స్కిల్స్ కోర్సు లుంటాయని, ఐటి రంగానికి సంబంధించిన నైపుణ్యాల పట్ల విద్యార్థులకు మంచి అవగాహన కలిగించి వారు ఉద్యోగాలు పొందేలా కృషి చేస్తారని ఆయనన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి మాజీ కార్యదర్శి, ఏపి విద్యారంగ సంస్కరణల ఉన్నతస్థాయి కమిటీ సభ్యుడు ఎస్. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏపిలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నామని, సమగ్రమైన విద్యావిధానాన్ని తీసుకువచ్చేందుకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటైందని అన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల నియంత్రణ, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల జీతభత్యాలు, సిలబస్, పరీక్షా విధానం తదితర విషయాలన్నిటిపై అధ్యయనం చేసి నాలుగునెలల్లో ఒక సమగ్రమైన నివేదికను ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తమను ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్స్‌కు చెందిన రామకృష్ణారెడ్డి, మెగ్నీషియా ఎం.డి గోపాల్‌రెడ్డి, ప్రముఖ సాంకేతికరంగ శిక్షణా నిపుణుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ అందుకున్న రామిశెట్టి శివయ్య



నెల్లూరు జిల్లా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐయస్‌టి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రామిశెట్టి శివయ్య వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. డాక్టర్ హేమాద్రిరెడ్డి ఆధ్వర్యంలో 'ఎ స్టడీ ఆన్ పెంస్టాటిక్ ఫ్లో ఆఫ్ బయోఫ్లూయిడ్స్ త్రూ ఛానల్స్' నందు పరిశోధన చేసి వ్యాసాన్ని సమర్పించినందుకు ఆయన డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి, యస్ అండ్ హెచ్ హెచ్‌ఓడి డా. రవీంద్రరెడ్డి, అధ్యాపకులు శివయ్యను అభినందించారు.

### ఇక పారిశ్రామికంగా...

# ఆత్మకూరుకు మహర్దశ

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖా మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చొరవతో ఆత్మకూరు పారిశ్రామికవాడకు త్వరలో అనుమతులు రానున్నాయని రాష్ట్ర ఐటీ అండ్ ఈ అండ్ సీ జాయింట్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలంలోని నారంపేట వద్ద ప్రతిపాదిత పారిశ్రామికవాడ భూములను ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ ప్రమోషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఏపీ శాక్ సైంటిస్ట్ కణ్ణన్ తదితరులతో కలిసి ఈనెల 16న పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక భూముల పరిశీలన గూడూరు, దక్కిలి, మనుబోలు, నాయుడుపేట తదితర చోట్ల ఇప్పటికే పూర్తయింది దన్నారు. ప్రధానంగా రహదారి, ఓడరేవు, రవాణా, నీటి సౌలభ్యం లాంటి వనరుల ఆధారంగా పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయనున్నారని వివరించారు. ఆత్మకూరు మండలం నారంపేట వద్ద భూములు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయని, అయితే నీటి సౌలభ్యంపై ప్రభుత్వంతో సంప్రదించి ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఆత్మకూరులో ఎలక్ట్రానిక్స్ పార్క్ తొలి దఫాలో ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందని, కార్యరూపం దాలిస్తే 400 నుంచి 500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇన్‌చార్జి తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఆర్ఐ ప్రదీప్, సర్వేయర్ రాఘవయ్య, వీఆర్‌ఓలు మాల్యాద్రి, కృష్ణ, విజయలక్ష్మి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పరిషత్ ఎన్నికలకు

# కౌంట్‌డౌన్..

జిల్లాలోని 46 జెడ్పీటీసీలు, 583 ఎంపీటీసీల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈనెల 16 న జెడ్పీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లలోనే జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి 16,45,641 మంది ఓటర్లు ఉన్నారని అందులో 8,10,460 మంది పురుష ఓటర్లు, 8,35,003 మంది మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్ కింద 178 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. వీరి కోసం 1403 ప్రదేశాల్లో 1973 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాల్లో మాత్రమే పోలింగ్ స్టేషన్లు ఉంటాయన్నారు. అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత ఈనెల 24 వ తేది పోలింగ్ స్టేషన్ల జాబితాను జెడ్పీ, కలెక్టరేట్, ఎంపీడీఓ, గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో ప్రచురిస్తామన్నారు. గత ఎన్నికల్లో మిగిలిపోయిన పాత బ్యాలెట్ పేపర్లను కలెక్టర్ అనుమతితో కాల్చివేస్తామన్నారు. త్వరలో జరుగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ పంచాయితీ ఎన్నికలకు సంబంధించిన ఖాళీ బ్యాలెట్ పేపర్లను పాత జెడ్పీ కార్యాలయంలోని గదిలో ఉంచి సీలు వేశారు.

# కమలంతో... కయ్యమేనా?

(మొదటి పేజీ తరువాయి)

కాకపోతే కేంద్రంతో ఘర్షణకు దిగి కాకుండా, రాష్ట్ర పరిస్థితులు వివరించి ప్రత్యేకహోదా ఆవశ్యకతను తెలియజేసి సాధించాలనుకుంటున్నాడు. కాని, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదాను ప్రకటించే అవకాశాలు కనుచూపు మేరల్లో కనిపించడం లేదు. ఇప్పటికే పలువురు కేంద్రమంత్రులు ప్రత్యేకహోదా అనేదే లేదని స్పష్టం చేశారు. కాబట్టి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై కేంద్రంతో జగన్ పోరాటానికి దిగక తప్పకపోవచ్చు.

రాష్ట్రం ఆర్థికంగానూ చాలా బలహీనంగా వుంది. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని 2.56 లక్షల కోట్లు అప్పుల్లో ముంచింది. రాష్ట్రానికి ఆదాయ వనరులు పెద్దగా లేవు. కాని ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలకు వేలకోట్లు అవసరముంది. కేంద్రం చూస్తే ఏపికి మిగిలిన రాష్ట్రాలకంటే కూడా నిధుల విడుదలలో చిన్నచూపు చూస్తోంది. కేంద్రం ఏపికి ఉదారంగా నిధులు మంజూరు చేయకుంటే రాష్ట్రం చాలా ఇబ్బందుల్లో పడుతుంది. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధుల కోసం సైతం కేంద్రంతో పోరాడక తప్పేట్లు లేదు.

ఇవే కాదు రాష్ట్ర ప్రయోజనాల దృష్టిలో జగన్ పోతుంటే, ఏపిలో రాజకీయ ప్రయోజనాల కోణంలో బీజేపీ అధిష్టానం ఏపి ప్రభుత్వ ఆలోచనా ధోరణికి వ్యతిరేకంగా ఉంటోంది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై విచారణ చేపట్టాలని జగన్ కేబినెట్ నిర్ణయించింది. అయితే దీనిని కేంద్రం వద్దంటోంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో ఎన్నో అక్రమాలున్నాయి. ప్రభుత్వమే అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసింది. ఇదంతా కొందరికి లబ్ధి చేకూర్చడం కోసం చేసిన ప్రయత్నమే! విచారిస్తే ఈ లొసుగులన్నీ బయటపడతాయి. దీనికి కేంద్రం మోకాలడ్డు తోంది. తద్వారా అక్రమార్కులను కాపాడే ప్రయత్నం చేస్తోంది. అంతేనా, గత ప్రభుత్వ హయాంలో బ్యాంకులకు వేలకోట్లకు ఎగనామం పెట్టిన టీడీపీ ఆర్థిక నేరస్తులను బీజేపీ నాయకత్వం తమ పార్టీలో చేర్చుకుంటోంది. ఇలాంటి వాళ్ళందరినీ కట్టడి చేయాలని జగన్ చూస్తుండగా, రాష్ట్రంలో తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ వారిని చేర్చుకుంటోంది. ఈ పరస్పర విరుద్ధ వైఖరివల్ల కూడా త్వరలోనే వైసిపి వర్సెస్ బీజేపీ అన్న రీతిలో రాష్ట్ర రాజకీయ పోరాటాలు వుండబోతున్నాయి.

### జాతీయస్థాయిలో

## సుమంత్‌కు నాల్గవ ర్యాంకు

నెల్లూరులోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రేడియేషన్ అంకాలజిస్ట్‌గా పనిచేస్తున్న సుమంత్‌కుమార్‌రెడ్డి నీట్ సూపర్ స్పెషాల్టీ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో నాల్గవ ర్యాంకును సాధించారు. కేన్సర్ ఆసుపత్రిలో పనిచేస్తూనే ఉన్నత స్థాయి మెడికల్ అంకాలజి డీఎం కోర్సు కోసం గత నెల 28న పరీక్ష రాశారు. నాయుడుపేట మండలం కూచివాడపాళెం సుమంత్‌కుమార్‌రెడ్డి స్వగ్రామం.

### ప్రభుత్వ భవనాలను

# గుర్తించాలి

**- కమిషనర్ పీవీవీఎస్ మూర్తి**

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో సచివాలయాల ఏర్పాటుకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్ళను గుర్తించాలని నగర కమిషనర్ పీవీవీఎస్ మూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 15న కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మెప్మా ఉద్యోగులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డు వాలంటీర్ ఇంటర్వ్యూలు పూర్తయ్యే సరికి వారికి కేటాయించాల్సిన ఇళ్లను ఒక టెరిటోరియల్ యూనిట్‌గా తయారుచేయాలని ఆదేశించారు. ఒక యూనిట్‌కు 50ఇళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంటి యజమాని పేరు, ఫోన్ నెంబరు, ఆధార్ నెంబర్లను సేకరించాలని సూచించారు. 54 మంది రెవిన్యూ బిల్ కలెక్టర్లు, 15 మంది మెప్మా సీఓలు, 54మంది ఆర్‌పీ(రిసోర్స్ పర్సర్లు) సంబంధిత వివరాలను సేకరించాలని కోరారు. ఈనెల 25వ తేదీలోగా పూర్తి స్థాయిలో 3040టెరిటోరియల్ యూనిట్లను తయారు చేయాలన్నారు.

డిప్యూటీ కమిషనర్ పార్థసారథి, టౌన్ ప్రాజెక్ట్ రిసోర్స్ ఆఫీసర్ ప్రసాద్, కార్పొరేషన్ మేనేజర్ గిరిజ, రెవిన్యూ ఆఫీసర్లు రాజేశ్వరి, సమద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

# హరిచందన్

(మొదటి పేజీ తరువాయి)

కలిగివున్నారు. ఏపికి కొత్త గవర్నర్‌గా నియమితులైన హరిచందన్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

2014లో విభజన ద్వారా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ఏర్పడ్డప్పటికీ ఇరు రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నర్‌గా ఈఎస్ఎల్ నరసింహన్ వ్యవహరిస్తూ వచ్చారు. అయితే ఏపికి ప్రత్యేక గవర్నర్‌ను నియమించాలనే డిమాండ్ ఎప్పటినుండో వుంది. అది ఇప్పటికి నెరవేరింది.

# చంద్రయాన్-2

(మొదటి పేజీ తరువాయి)

లీక్‌ను గుర్తించి ప్రయోగాన్ని నిలిపేశారు. కేవలం 48 గంటల్లోపే లోపాలను సరిచేసి జాబిలి యాత్రకు వాహన నౌకను మన ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధం చేయడం అభినందనీయం. ఏదేమైనా ఈ ప్రయోగ విజయం కోసం దేశ వ్యాప్తంగా అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

### కవితలు, రచనలు..

# సామాజిక మార్పుకు ప్రతీకలు



స్నేహ పరిమళం సత్కారాలనందుకున్న కవులు, కవయిత్రులు, రచయితలు

కవితలు, వివిధ రచనలు సామాజిక మార్పుకు, చైతన్యానికి ప్రతీకలుగా నిలవాలని తెలంగాణా రాష్ట్ర జనసత్తా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 13న నెల్లూరు సరస్వతీనగర్‌లోని ఐయంఏ హాలులో స్నేహ పరిమళం సామాజిక సాహిత్య సంస్థ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నవ భారత నిర్మాణంలో దేశ సౌభాగ్యానికి మూల స్థంభాలుగా రచనలు చేస్తూ సమగ్ర అభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తున్న అవినీతిని ఎదిరించే దిశగా రచనలు చేయాలని కవులకు హితవు పలికారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ జానపద కళల ఛైర్మన్ పొట్లూరి హరికృష్ణ మాట్లాడుతూ సమాజంలో ఆదరణ కోల్పోతున్న కళాకారులను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రముఖ కవి స్నేహ పరిమళం గౌరవాధ్యక్షులు తురగా వేణుగోపాల రామచంద్రరావు, ప్రముఖ కవి, రచయిత దాస్యం సేనాధిపతి తదితరులు మాట్లాడారు. సభాధ్యక్షులుగా ములుగు రామ్మోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు, రచయితలు, రచయిత్రులు కూసుమంచి శ్రీదేవి, రమాదేవి, భాగ్యలక్ష్మి, రాధాలక్ష్మి,లీలా రంగనాథం, కమలాకర్, బాలసుబ్రహ్మణ్యం, గొట్టుముక్కల గోవిందు, మోపూరు పెంచల నరసింహం, మాటేటి రత్న ప్రసాద్‌లను శాలువలతో, పూలమాలలతో స్నేహ పరిమళం సంస్థ వ్యవస్థాపకురాలు ములుగు విజయదుర్గ (వినీల) సత్కరించారు. నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎ. జయప్రకాష్, కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, గోవిందరాజుల సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వీసీ, రిజిస్ట్రార్‌లను తొలగించాలి

విక్రమ సింహపురి యూనివర్శిటీలో అవినీతిని ప్రోత్సహిస్తున్న వైస్ చాన్సలర్ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ అందె ప్రసాద్‌లను వెంటనే తొలగించాలని వైయస్సార్ విద్యార్థి విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి అమరావతిలోని అతిథిగృహంలో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఈనెల 17న వినతిపత్రం అందజేశారు. రాజశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ వద్దంటోంది!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల ఫలితాలతో చంద్రబాబు కలల సౌధాలు కూలిపోయాయి. ఢిల్లీలో ఆయన తిప్పాలనుకున్న చక్రానికి గాలిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దూకుడు పెంచింది. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతి భాగోతాలపై వైసిపి ప్రభుత్వం విచారణకు ఆదేశించడం తెలిసిందే! ఇంకోపక్క తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా 'నోటు-ఓటు' కేసు ఫైల్‌ను తిరిగి తెరమీదకు తెచ్చాడు. ఇటు జగన్... అటు కేసీఆర్... చంద్రబాబుపై ఆటను మొదలుపెడితే ఆయన తట్టుకునే పరిస్థితిలో లేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కూడా చంద్రబాబుకు విరోధమే. చంద్రబాబు నిన్నటి ఎన్నికల్లో ఓడినా కనీసం ఎన్డీఏలో వుండుంటే వాళ్ళన్నా ఆయనను కాపాడే ప్రయత్నం చేసేవాళ్ళు. చంద్రబాబు అందరికంటే ఎక్కువగా తిట్టింది బీజేపీ వాళ్ళనే! ఇప్పుడు చంద్రబాబును కాపాడగలిగింది కూడా వాళ్ళే!

తనను తాను కాపాడుకోవడం కోసం చంద్రబాబు ఇటీవల తన పార్టీ రాజ్యసభ సభ్యులు నలుగురిని బీజేపీలోకి తోయడం తెలిసిందే! సుజనాచౌదరి, సీఎం రమేష్ వంటి ఆర్థిక నేర ఆరోపణలున్న ఎంపీలను రక్షించడంతో పాటు వారిద్వారా తనను తాను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే చంద్రబాబు తన పార్టీ ప్రయోజనాలను సైతం తాకట్టుపెట్టాడు.

అయితే ఏరోజైతే టిడిపి పార్లమెంటరీ పార్టీ బీజేపీలో విలీనం అయ్యిందో ఆరోజు నుండే రాష్ట్రంలో బీజేపీ జోరు పెంచింది. టీడీపీని మింగే ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇప్పటికే బీజేపీ నాయకులు పలువురు టీడీపీ నేతలతో సంప్రదింపులు జరిపి వారందరికీ కాషాయ తీర్థం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.

తన పార్టీ నుండి బీజేపీలోకి వలసలు మొదలైతే ఇక పార్టీని నిలుపుకోవడం కష్టమని చంద్రబాబు భయపడుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీ నేతలను ఆపుకోవడానికి ఎన్డీఏలో తిరిగి తమ పార్టీ చేరుతుందని ఆయన బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాకు రాయబారం పంపినట్లు సమాచారం. అయితే చంద్రబాబును ఇక జీవితంలో నమ్మేది లేదని, ఆయన్ను ఇక ఎన్డీఏలోకి రానిచ్చేది లేదని వాళ్ళు తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది.

ఇప్పుడు చంద్రబాబును తమ కూటమిలో చేర్చుకోవాల్సిన అవసరం కూడా వాళ్లకు లేదు. ఏపిలో టీడీపీని నిర్వీర్యం చేసి వచ్చే ఎన్నికలనాటికి ఆ స్థానంలో తాము వుండాలన్నది బీజేపీ అధిష్టానం వ్యూహం. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. ఇంతకాలం టీడీపీతో స్నేహం వల్లే ఆ పార్టీ ఏపిలో ఎదగలేకపోయింది. ఇప్పుడు టీడీపీనే మింగేసి ఏపిలో పాతుకుపోయే అవకాశం వస్తే... వాళ్ళు దానిని వదులుకుంటారా?

# ఇసుక లేక.. ఇబ్బందులెన్నో...



**ఆపినా ఇబ్బంది లేని మద్యం అమ్మకాలనేమో పాత విధానంతో కొనసాగిస్తున్నారు. ఆపితే ఇబ్బందులేర్పడే ఇసుకనేమో ఆపేశారు.**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఒక్క నెలరోజుల్లోనే మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజాభిమానాన్ని చూరగొనేలా పరిపాలన సాగిస్తున్నాడు. ముఖ్యంగా ప్రభుత్వ వ్యవస్థల్లో పాతుకుపోయిన అవినీతిని రూపుమాపడానికి ఆయన పడుతున్న తపనను అందరూ అభినందిస్తున్నారు. అయితే ఈ నెల రోజుల్లో ఒక్క నిర్ణయం మాత్రం విమర్శలకు గురవుతోంది. ఎందుకంటే ఈ నిర్ణయం ఎన్నో లక్షలమంది కూలీల రోజువారి బ్రతుకు పోరాటాన్ని ఆపడమేకాదు, ప్రతినిత్యం కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు ఆగిపోవడానికి కారణమవుతోంది. ఆ నిర్ణయమే ఇసుక తవ్వకంపై నిషేధం.

ఇసుకపై కొత్త పాలసీని తీసుకురావాలని చెప్పి తవ్వకాలపై నిషేధం పెట్టారు. గృహావసరాలకు తహశీల్దార్, ఆర్టీఓల అనుమతితో ఎద్దుల బండ్ల ద్వారా మాత్రమే ఇసుకను తోలడానికి వెసులుబాటు కల్పించారు.

### కుదేలైన ఉపాధి కల్పనా రంగం

ఇప్పుడు దేశంలోనే వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద ఉపాధి కల్పనా రంగం నిర్మాణ రంగమే! రియల్ ఎస్టేట్‌లో ఇప్పుడు నిర్మాణ రంగం ఓ భాగం. చిన్న చిన్న ఇళ్ళు కట్టుకునేవాళ్ళకు ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక అంటే సరిపోతుంది. నగరాలలో పట్టణాలలో ఇప్పుడన్నీ భారీ అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు నిర్మాణంలో వున్నాయి. రియల్‌ఎస్టేట్‌లో గృహ సముదాయాల నిర్మాణం ఎక్కువుగా వుంటుంది. కొన్ని లక్షల మందికి వివిధ రూపాలలో ఉపాధి లభిస్తోంది. ఇసుక అనే ఒక్క పదార్ధం లభించకపోవడంతో మొత్తం నిర్మాణ రంగమే స్థంభించిపోయింది.

ఇసుక లేకుంటే నిర్మాణమే ముందుకు సాగదు. ఇసుక లేకుంటే ఇటుక అవసరం లేదు, సిమెంట్, స్టీలు కొనరు. గృహ నిర్మాణ యంత్రాలకు పని వుండదు. ఇతర గృహోపకరణాల వ్యాపార లావాదేవీలు, పెయింట్లు దీనికి అనుబంధ వ్యాపారాలన్నింటిలోనూ ప్రతిష్టంభన తప్పదు.

అన్నింటికిమించి నిర్మాణ రంగం మీదే ఆధారపడి ఒక్క నెల్లూరు జిల్లాలోనే కొన్ని వేలమంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ఏరోజు కారోజు వచ్చే కూలీ డబ్బులతోనే వీళ్ళు జీవనం సాగించాలి. నెల రోజులుగా నిర్మాణ పనులు ఆగిపోవడంతో వీళ్ళు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ రంగ వ్యాపారులు సైతం పనులు ఆగిపోవడంతో అసంతృప్తి చెందుతున్నారు.

ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని తీసుకురావాలనుకుంటోంది. అది తెచ్చేదాకా పాత విధానంలోనే మద్యం అమ్మకాలకు అనుమతి ఇచ్చింది కదా! ఒకవేళ కొత్త విధానం తెచ్చేదాకా ఓ రెండు నెలలు మద్యం అమ్మకాలు ఆపేసినా వచ్చే ఇబ్బందేమీ లేదు. ఇంకా ప్రజల ఆరోగ్యాలు, ఆర్ధిక స్థితులన్నా బాగుపడతాయి. ఆపినా ఇబ్బంది లేని మద్యం అమ్మకాలనేమో పాత విధానంతో కొనసాగిస్తున్నారు. ఆపితే ఇబ్బందులేర్పడే ఇసుకనేమో ఆపేశారు. ఇసుకపై కొత్త పాలసీ వచ్చేదాకా పాతపద్ధతిలోనే ఇసుక తవ్వకాలకు అనుమతినిచ్చి వుంటే ఏ సమస్యా వుండేది కాదు. నిర్మాణ రంగం ఆగిపోయేది కాదు. ఇసుక రాష్ట్ర సరిహద్దులు దాటకుండా రాష్ట్ర పరిధిలోని నిర్మాణాలకు మాత్రమే వాడేలా చూసుండొచ్చు. ఇలా నెలల తరబడి నిషేధం పెట్టడం వల్ల సమస్య తీవ్రమవుతుందే కాని ప్రయోజనం ఏమీ లేదు.

# అదరగొడుతున్న అనిల్



శాసనసభ బడ్జెట్ సమావేశంలో నెల్లూరుజిల్లా వైసిపి ఎమ్మెల్యేలు దుమ్ము రేపుతున్నారు. చర్చల్లో ఆసక్తికరంగా పాల్గొంటున్నారు. ఈ సమావేశాలలో ఇరిగేషన్‌పై ఎక్కువసార్లు చర్చ వస్తుండడంతో మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ తనదైన శైలిలో స్పందిస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్‌తో పాటు మిగిలిన ఇరిగేషన్ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచడంలో గత ప్రభుత్వ అక్రమాలను ఆయన లెక్కలతో సహా వివరిస్తూ చెలరేగిపోతున్నారు. ఇరిగేషన్‌పై అనిల్‌కు పెద్దగా అవగాహన లేకపోయినా, గత ఒకటిన్నర నెలరోజుల్లోనే దానిపై లోతుగా అధ్యయనం చేశారు. సభలో సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి లాంటి వారికే సినిమా డైలాగ్‌ల రూపంలో సమాధానం చెబుతున్నారు. 'ఎప్పుడొచ్చామన్నది ముఖ్యం కాదు.. బుల్లెట్ దిగిందా లేదా అన్నదే ముఖ్యం' అంటూ మహేష్‌బాబు లెవల్లో డైలాగ్‌లు విసురుతున్నాడు. వయసులో చిన్నోడైనా వాగ్ధాటిలో తగ్గడంలేదు.

# సంక్షేమం ఎక్కువైనా సంక్షోభాలే!

**కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతుంటాయి. ఏ దేశ అభివృద్ధికైనా మూలం అక్కడ లభించే సహజవనరులే కాదు, శ్రమించే ఆ దేశ ప్రజలు కూడా! మనం చిన్నచిన్న దేశాల గురించి ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పుకుంటుంటాం... నిజమే, అవి అంతగా బాగా అభివృద్ధి చెందడానికి కారణం అక్కడి ప్రజల శ్రమైక జీవనమే!**



జనాభాలో మనకన్నా చైనా ముందుంది. అయినా ఆ దేశం అభివృద్ధి పథంలో అగ్ర రాజ్యంగా ఎదిగింది. కారణం 150కోట్ల జనాభా వుంటే ఆ దేశంలో ఖచ్చితంగా 130 కోట్ల మంది ఏదో ఒక పని చేస్తుండడమే. తద్వారా ఉత్పత్తిని పెంచి తమ దేశ ఆర్ధికాభివృద్ధికి దోహదపడుతుండడమే! అదే భారత దేశంలో 130కోట్ల మంది జనాభా వుంటే... గట్టిగా 30కోట్ల మంది పని చేస్తారు. ఇలా వుంటే చైనా స్పీడ్‌ను మనమెప్పుడు అందుకోగలం. పని చేసే ఈ 30కోట్ల మందిలో కూడా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల వల్ల సోంబేరులు తయారవుతున్నారు.

సంక్షేమ కార్యక్రమాలు శృతి మించితే ఏమవుతుందన్నదానికి ఇటీవల కాలంలో 'వెనిజులా' దేశాన్ని ఒక ఉదాహరణగా చూపిస్తున్నారు. ఆ దేశంలో మితిమీరిన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం వల్ల ఆ దేశంలో ఉత్పాదన ఆగిపోయి ఇప్పుడు ఆ దేశ ప్రజలు అడుక్కుతినే స్థితిలో వున్నారు.

మన దేశంలోని పలు రాష్ట్రాలలో కూడా సంక్షేమ కార్యక్రమాల అమలు హద్దులు దాటుతోంది. పక్కనే వున్న తమిళనాడులో అయితే రాజకీయ పార్టీలు ప్రజలకు అలివిగాని హామీలు ఇవ్వడం, బడ్జెట్‌నంతా కూడా వాటి అమలుకే కేటాయించడంతో సరిపోతోంది.

ఇదే బాటలో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కూడా వుందనిపిస్తోంది. ఈ రాష్ట్ర ప్రజలు స్వతహాగా తెలివైన వాళ్ళు. శ్రమించే గుణమున్నోళ్ళు. ఏ ప్రాంతంలోనైనా పనితీరు ద్వారా రాణించగలరు. అలాంటి శ్రమించే తత్వం వున్న ప్రజలు కాబట్టే విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఆర్ధికంగా భారీ నష్టం జరిగినప్పటికీ కుంగిపోకుండా నిలిచాం. గత ఐదేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన దుబారాకు ఇంకో రాష్ట్రం అయ్యుంటే పూర్తిగా దివాళా తీసుండేది. ఆంధ్ర ప్రజలు పనిచేసే వాళ్ళు కాబట్టి మన ఆర్ధిక వ్యవస్థ కుప్పకూలిపోలేదు.

నిన్నటి ఎన్నికల్లో 'సంక్షేమం' అనే ముసుగులో ఓట్ల కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 30వేల కోట్లు వెదజల్లడం చూశాం. 'పసుపు – కుంకుమ', పింఛన్‌ల పెంపు వంటివాటి ద్వారా 30వేల కోట్లు ప్రభుత్వ ధనాన్ని వృధా చేసి రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థపై పెనుభారం మోపారు. అన్న క్యాంటీన్‌ల ద్వారా 5 రూపాయలకే భోజనం అన్నది అతిపెద్ద బోగస్ కార్యక్రమం. ఈరోజు ఏ గుడి ముందు ఐదు నిముషాలు నిలబడి చేయిచాపినా ఐదు రూపాయలు చేతిలో పడతాయి. కాబట్టి అన్న క్యాంటీన్‌లు ఇలాంటి వారికి ఉపయోగపడుతున్నాయి. కాని, వీటి నిర్వహణకు మాత్రం కోట్లు ఖర్చవుతున్నాయి.

ఇప్పుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కూడా సంక్షేమ పథకాలు హద్దులు దాటుతున్నయేమోననిపిస్తోంది. ఎన్నికలకు ముందు ప్రజాసంకల్ప పాదయాత్రలో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు ఎన్నో వరాలిచ్చారు. అమ్మఒడి, రైతు భరోసా, పింఛన్‌ల పెంపు, ఆయా విభాగాలలో ఉద్యోగులకు జీతాలు పెంచడం, సిపిఎస్ రద్దు చేయడం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చెయ్యడం వంటి సంక్షేమ హామీలెన్నో వున్నాయి. వైసిపి అధికారంలోకి రాగానే జగన్ ముందు తానిచ్చిన సంక్షేమ హామీల అమలుపై దృష్టి పెట్టాడు. ఆయా రంగాలలో కార్మికులకు భారీగా వేతనాలు పెంచడంతో పాటు, పింఛన్‌లు పెంచాడు. 'అమ్మఒడి' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే పరిమమితం చేయకుండా ప్రైవేట్ పాఠశాలలకు అది కూడా ఇంటర్మీడియట్ వరకు విస్తరింపజేశాడు.

అసలే రాష్ట్రంలో ఆర్ధిక పరిస్థితులు బాగా లేవు. ఖజానాలో చిల్లిగవ్వ లేదు. కేంద్రం నుండి సాయం అందడం లేదు. రూపాయి అడిగితే వాళ్ళు 10పైసలు ఇస్తున్నారు. హైదరాబాద్ పోయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోయింది. రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థ పూర్తిగా పుంజుకున్నాకే, ఇతర రంగాలలో అభివృద్ధి మెరుగుపడ్డాక ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినా ఇబ్బంది వుండదుగాని ఆర్ధిక వనరులు అంతంత మాత్రంగా వున్న తరుణంలో అభివృద్ధి కంటే సంక్షేమ పథకాల అమలుకే మొదటి ప్రాధాన్యతనిస్తే ఆర్ధిక సంక్షోభానికి దారులు తెరుచుకున్నట్లే!


## జనరల్ నోటీసు

మా కక్షిదారులు నూకల శివరాం సుకుమార్ S/o శేషయ్య గుప్తా, కామాటివీధి, నెల్లూరు మరియు పురిమి రామాంజనేయులు S/o వీరయ్య సంతపేట, నెల్లూరు మరియు ఇతరులు, అనువారు యిచ్చిన సంజాయిషీ మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా.

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి మెస్సర్స్ **మాధవ్ గోపిక కాంప్లెక్స్ ప్రై. లిమిటెడ్** Rep. by its మేనేజింగ్ డైరెక్టర్ డేగా దేవకుమార్‌రెడ్డి, Whole Time Director డేగా దొరసానమ్మ and Director డేగా శ్రీనివాసులురెడ్డి, మరియు **మెస్సర్స్ వెంకటరామ ఎంటర్‌ప్రైజెస్,** A Partnership firm Rep. by its పార్టనర్స్ డేగా పుష్పవేణమ్మ, డేగా రామిరెడ్డి, డేగా వెంకటరమణారెడ్డి, మన్నూరు ప్రేమ్‌కుమార్ అలివేణి, కోటిరెడ్డి స్వర్ణలత అనువారల పూర్తి స్వాధీన హక్కు అనుభవంలో ఉన్నదని చెప్పుచూ వారు మా కక్షిదారులకి అమ్మజూపినారు. ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 10రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా తెలియజేయగలరు. ఆపై వచ్చు ఆక్షేపణలు మా కక్షిదారులపై బద్ధగించవు.

**షెడ్యూలు**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రి॥డి॥ నెల్లూరు సబ్ రి॥ నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, నెల్లూరు సిటి, ఆర్.ఆర్.స్ట్రీట్, Previously రాధామాధవ్ గోపిక సినిమా థియేటర్స్ స్థలం విస్తీర్ణం 332 అంకణముల స్థలమునకు హద్దులు:

తూర్పు : ఎ.చెంచురామయ్య యితరుల బిల్డింగ్
దక్షిణం : జొన్నలగడ్డ వారి వీధి
పడమర : యితరుల స్థలం
ఉత్తరం : ఆర్.ఆర్.స్ట్రీట్

**కొండూరు శేషారెడ్డి,** అడ్వకేటు
**లక్ష్మీనగర్, బాలాజీనగర్, నెల్లూరు. సెల్: 9440277290**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com